ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 27 అక్టోబరు 2024 | 5

అతి వినియోగం ప్రమాదమే..



ప్రతి వస్తువులోను మంచిచెడులు ఉంటాయి. కేవలం మంచిని గ్రహించాలి. కత్తితో వైద్యుడు శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు నిలబెడతాడు. అదే కత్తితో చెడ్డవాడు ప్రాణాలు తీస్తాడు. ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చిందే ఇంటర్నెట్. దానిని స్మార్ట్‌ఫోన్‌లో పరిమితంగా వినియోగిస్తే జ్ఞానమే. ఎడిక్ట్ అయితే ప్రమాదమే. పిల్లలు దేనికి అలవాటుపడితే దానికి బానిసలవుతారు. ఆ పరిస్థితి రాకుండానే తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, మానసిక వైద్యనిపుణులు, రాజమండ్రి

రబీ వరి వంగడాలివే

కరపత్రం ఆవిష్కరించిన కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రబీకి అనుకూలమైన వరి వంగడాలను రైతులు ఎంపిక చేసుకోవాలని.. దీనికి సంబంధించిన వ్యవసాయ శాఖ ఓ కరపత్రం సిద్ధం చేసిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావుతో కలిసి రబీ వరి వంగడాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎంటీయూ 1121 (శ్రీధృతి), ఎంటీయూ 1156 (తరంగిణి), ఎంటీయూ 1153 (చంద్ర), ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మహూరి), ఎంటీయూ 1010 (కాటన్‌దొర సన్నాలు), ఎంటీయూ 3626 (ప్రభాత్), ఎన్‌డీఎల్ఆర్ 8 (నంద్యాల సన్నాలు), ఎంటీయూ 1210(సుజాత),ఎన్ఎల్ఆర్ 3354 (నెల్లూరు ధాన్యరాశి),ఎంటీయూ రైస్ 1293, ఎన్ ఎల్ఆర్ రైస్ 3238, ఎంటీయూ రైస్ 1273 రకాలు ఎంపిక చేసుకోవాలన్నారు.



విద్యార్థులకు ఓపెన్‌హౌస్

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విధినిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడేవాడు పోలీస్ అని..అటువంటి పోలీసులను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ స్మారకోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థులకు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు.విద్యార్థులకు సైబర్ అవేర్‌నెస్ ప్లకార్డులను వినూత్నంగా ప్రదర్శించారు.పోలీసుశాఖ ఆయుధాలు , టెక్నాలజీపై అవగాహన కల్పించారు. 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

8 టిప్పర్ లారీలు అడ్డగింత

దివాన్‌చెరువు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం భూపాలపట్నంలో వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గ్రామస్తులతో కలిసి శుక్రవారం అర్ధరాత్రి 8 టిప్పర్ లారీలను అడ్డుకున్నారు. లారీలలో పాతతుంగపాడు నుంచి దుళ్లకు అక్రమ గ్రావెల్ తరలిస్తున్నారన్నారు.సహజవనరుల దోపిడీ, మాదకద్రవ్యాలకు రాజానగరం నిలయంగా మారిందన్నారు.రాజానగరం తహశీల్దార్‌కు ఫోన్ చేసినా స్పందనలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆమె వెంట పంతం దుర్గారావు,తోరాటి సోమరాజు, తోరాటి గోవిందు, మరుకుర్తి వెంకటేశ్వరరావు ఉన్నారు

ఆదివారం ప్రత్యేకం

సెల్‌కలం!



పాప ఏడుస్తోంది.. ఉడ్‌వర్డ్స్ పట్టవే.. ఇదీ చాలా సుపరిచితమైన యాడ్.. ఇది ఒకప్పటి మాట.. మరిప్పుడు పాప ఏడుస్తోంది అంటే సెల్‌ఫోన్ ఇవ్వు ఊరుకుంటుందే అనే రోజులు వచ్చేశాయి.. పిల్లలు ఏడాది నుంచే సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయిపోతున్నారు.. అదే మంచిదనుకుని.. చిన్నారులకు సెల్‌ఫోన్ ఇచ్చేసి తమ పని తాము చేసుకుంటున్నారు.. సెల్ ఎందుకిచ్చావే అంటే ఫోన్ ఇస్తేనే కానీ ఊరుకోవడంలేదనేది పెద్దల మాట.

ఒక పిల్లాడు తీక్షణగా సెల్‌ఫోన్ చూస్తున్నాడు.. సెల్ ఫోన్ పక్కన పెట్టేసి చదువుకోమని తల్లి చెబుతూనే ఉంది.. అయినా వినకపోవడంతో సెల్‌ఫోన్ లాక్కుని పుస్తకం చేతిలో పెట్టి చదువుకోమని చెబుతోంది. అనంతరం ఆమె టీవీ పెట్టుకుని చూస్తూ ఉంటుంది.. అప్పటికే సెల్‌ఫోన్ లాక్కుందని కోపంతో ఉన్న కుమారుడు.. పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్ తీసుకుని తల్లి తలపై మోదుతాడు.. ఇదీ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.. సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయితే ఎంత ప్రమాదమో చాటి చెప్పింది..

ఒక పెద్దావిడ సెల్‌ఫోన్ చూస్తూ ఇంట్లో వంట చేస్తోంది.. ఫోన్‌లో పడి వంట సంగతి మర్చిపోయింది.. కాసేపటికి కిచెన్ నుంచి పొగలు వస్తున్నాయి.. అయినా ఆమెకు వాసన తగల్లేదు.. ఇంతలో అదృష్టం కొద్దీ ఆమె భర్త ఇంటికి వచ్చాడు.. ఇంట్లో నుంచి వచ్చే పొగను చూసి కంగుతిన్నాడు.. వెంటనే ఏమేవ్ ఏం చేస్తున్నావ్.. ఇల్లు తగలబడిపోతుందే అంటూ పెద్దగా కేకలు వేశాడు.. తేరుకున్న ఆమె కిచెన్‌లోకి వెళ్లి చూసేసరికి వండిన కూర కాస్తా మాడిమసైపోయింది.. కాసేపు ఆగితే మంటలు చెలరేగి పెద్ద ప్రమాదమే జరిగేది.

ఆసుపత్రిలో ఉన్నా.. తల్లిదండ్రులతో షాపింగ్‌లో ఉన్నా.. బైక్‌పై వెళుతున్నా.. కారులో వెళుతున్నా.. ఇంట్లో ఉన్నా.. ప్రస్తుతం చిన్నారుల చేతిలో కనిపించేది ఒక్కటే.. అదే సెల్‌ఫోన్.. బడిలో తప్పించి ప్రతి చోటా చిన్నారుల ప్రపంచం సెల్ బందీగా మారిపోయింది.. అది లేనిదే అన్న ముట్టరు.. అది చూడనిదే స్నాక్స్ తినరు.. అందుకే నేటితరం చిన్నారుల్లో నూటికి 60 శాతం చిన్నారులు నాలుగు కళ్లతో దర్శనమిస్తున్నారు..

(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం సిటీ)

అరచేతిలో ఫోన్..కంట్లో నలుసు

- టచ్ చేస్తే బోలెడు వినోదం
- ఎడిక్ట్ అవుతున్న పిల్లలు..పెద్దలు
- సెల్‌ని వదల్లేకపోతున్న వైనం
- దంపతుల మధ్య దూరం
- అటకెక్కుతున్న చదువులు
- ఫోన్లకు బాల్యం బందీ
- మందగిస్తున్న కంటిచూపు
- పక్కదారి పడుతున్న విజ్ఞానం

చందమామారావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే.. గోగిపూలుతేవే.. అంటూ చందమామను చూపిస్తూ తల్లులు వారి చంటిబిడ్డలకు గోరుముద్దలు తినిపించే రోజులు పోయాయి. ప్రస్తుత ఆధునికయుగంలో యాపిల్ రావే.. ఐఫోనురావే.. మా పిల్లవాడితో ఆడుకోవే.. గేమ్‌లతో రావే.. మా చంటిబిడ్డను అలరించవే అంటూ ప్రసుత్త యుగం తల్లిదండ్రులు చేస్తున్న చిన్నపాటి పొరపాటు భవిష్యత్తులో అది తీవ్రరూపం దాల్చి బాల్యంమంతా సెల్‌కు బానిసలుగా మార్చేసింది. తిండి లేకపోయినా ఉంటున్నారు కానీ పది నిమిషాలు సెల్ ఆగిపోతే ప్రాణం పోయినట్టు నేటి సమాజం తయారైంది. నేటి తరంలో ఏడాది చంటిబిడ్డ మొదలుకుని వృద్ధుల వరకు సెల్ బారిన పడనివారులేరంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ఉండడంకోసం, ప్రపంచ జ్ఞానం కోసం రూపొందించిన అంతర్జాల చరవాణి ఇప్పుడు కొత్తపుంతలు తొక్కి మనిషి ఆరోగ్యానికి హానికరంగా మారిపోయింది. ఇందులో మంచిని గ్రహించి పరిమిత వినియోగం చేసేవారికంటే చెడును గ్రహించే వారే ఎక్కువయ్యారు. ముఖ్యంగా పిల్లలపై పెనుప్రభావానే చూపిస్తుంది.

తెల్లారింది మొదలు..

మనిషి ఉదయం లేచిన నాటి నుంచి రాత్రి నిద్రించే వరకు ఉన్న సమయంలో సెల్ ఫోనుదే ప్రథమస్థానం. మంచం పైనుంచి లేవగానే ఫోన్.. కాలకృత్యాలు తీర్చుకుంటూ ఫోన్.. బ్రేక్ ఫాస్ట్ చేస్తూ ఫోన్.. ఇలా చెప్పుకుంటూపోతే ఫోన్‌తోనే రోజంతా ఉంటారు.. ఆఖరికి రాత్రి పడుకునే ముందు అర్ధరాత్రి వరకు ఫోన్‌లోనే ఉంటున్నారు. అది చాలదన్నట్టు ఇంట్లో గృహిణిలకు అంటించారు. ఇప్పుడు వాళ్లు కూడా అనుక్షణం ఫోన్‌లతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఇక పిల్లల విషయానికి వస్తే అన్నం తినను అన్నా.. మారం చేసినా ఫోన్ ఇచ్చి వారిని సముదాయిస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోతే గోలగోల చేసేవిధంగా కుటుంబమంతా ఎడిక్ట్ అయ్యింది.



చదువులపై పెనుప్రభావం

పిల్లలు అడిగారని తల్లిదండ్రులు ఆలోచించకుండా ఆండ్రాయిడ్ ఫోన్లను ఇస్తున్నారు. ఇదే ఇప్పుడు వీరి చదువుపై ప్రభావం చూపిస్తోంది. చదువుకునే సమయంలో ఫోన్ దగ్గర పెట్టుకుని చాటింగ్‌లు చేయడం, యూట్యూబులు చూడడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలు వెతుకులాట చేస్తూ చదువుపై ఏకాగ్రత సన్నగిల్లుతోంది. ఫలితంగా పిల్లలు చదువులో వెనుకబడుతున్నారు. నిజానికి కొన్ని స్కూల్స్, కళాశాలలో సెల్‌ఫోన్లను అనుమతించరు. ఎందుకంటే సెల్‌ఫోన్‌తో ఉంటే చదువు పాడైపోతుందని వారికి తెలుసు. కొన్ని కళాశాలల్లో మాత్రం ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ తప్పనిసరి అంటున్నారు. అవసరం మేరకు వాడితే సెల్‌ఫోన్ విజ్ఞానాన్ని పంచుతుంది. పరిమితిమించి వాడితే వినాశానానికి దారితీస్తుంది. కాబట్టి సెల్‌ఫోన్ ఇవ్వడం తప్పుకాదుకానీ..అది అతిగా వినియోగిస్తేనే తప్పు. తల్లిదండ్రులు మాత్రం అప్రమత్తంగా ఉండాలి.

దంపతుల మధ్య దూరం..

ఒకనాడు కుటుంబ బాంధవ్యాలు ఉండేవి.. పెద్దలు వస్తే చాలా గౌరవంగా చూసేవారు. మరిప్పుడో పెద్దలు వచ్చినా ఎవరి పని వారిదే.. సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలం గడిపేస్తున్నారు.. వచ్చిన వాళ్లు వెళ్లిపోతుంటే ఊ అనే చిన్న సమాధానం తప్ప.. క్షేమసమాచారం మాటే మరిచారు. కుటుంబంలో నలుగురు ఉంటే నలుగురు తలో సెల్‌ఫోన్ పట్టుకుని నాలుగు గోడల మధ్య జీవిస్తున్నారంటే పరిస్థితి ఎంతగా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. రాజమహేంద్రవరంలో ఇటీవల భార్యభర్తలు పార్కుకు వచ్చారు..ఒక మంచి ప్లేస్ చూసుకుని కూర్చున్నారు.. ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటారులే అని చూస్తుంటే అతను ఒక ఫోన్.. ఆమె ఒక ఫోన్ పట్టుకున్నారు.. వచ్చినప్పటి నుంచి వెళ్లే వరకూ కీపాడ్‌పై పైకీ కిందకూ లాగుతూనే ఉన్నారు. చివరికి భార్య లేచి వెళ్లిపోదాం అనే సిగ్నల్ ఇవ్వడంతో భర్త ఫోన్ జేబులో పెట్టుకుని బయలుదేరాడు. అంతలా దంపతుల మధ్య సెల్ దూరిపోయింది. దూరం చేస్తుంది. అంతేకాదండోయ్ సోషల్ మీడియా వాట్సాప్.. ఫేస్‌బుక్.. ఇన్‌స్టా తదితర యాప్‌లతో అనుమానపు చిచ్చురేగుతోంది. కుటుంబాలు విడిపోతున్నాయి. సెల్‌కి ఎడిక్ట్ అయిన భార్యభర్తను పట్టించుకోవడంలేదంటే అతిశయోక్తి కాదేమో.

దెబ్బతింటున్న ఆరోగ్యం

ఆండ్రాయిడ్ ఫోన్‌లకు ఎడిక్ట్ అయినవారు ప్రస్తుతం అనారోగ్య సమస్యలు బారిన పడుతున్నారు. ముఖ్యంగా చంటి బిడ్డకు చూపు మందగిస్తుంది. ఇంట్లో అదే పనిగా సెల్ చూస్తూ ఉండడం వల్ల కంట్లో రెటీనాపై ప్రభావం పడుతుంది. అందుకే పదేళ్లు దాటేసరికే చాలామందికి చూపు మందగిస్తోంది. స్కూల్‌కి వెళితే బ్లాక్ బోర్డు, డిజిటల్ బోర్డుపై అక్షరాలు కనిపించలేని పరిస్థితి. దీనికి ప్రధాన కారణంగా ఫోన్ నిలుస్తోంది. చీకటి గదిలో ఫోన్ చూడడం, ముఖానికి దగ్గరగా ఫోన్ పెట్టుకుని చూడడం వల్ల కంటి సమస్యలు వస్తున్నాయి. 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలు సెల్‌ఫోన్‌లో గేమ్‌లు ఆడుతున్నా తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోకపోవడంతో వారి మానసికస్థితిపై పడుతుంది. ఫ్రీఫైర్, హంటింగ్ తదితర గేమ్‌లు ఆడుతున్న బాలలు ఆ గేమ్‌లో ఉన్న వారిని అనుకరిస్తూ తమలో తామే మాట్లాడుకోవడం, ఆ గేమ్‌లో ఎటాక్‌లు జరిగినప్పుడు ఎదుర్కొనే దృశ్యాలు నిజజీవితంలో జరుగుతున్నట్టు ఫీలై ప్రవర్తించడం వంటివి చేస్తున్నారు. కొంతమంది పబ్‌జీకి ఎడిక్ట్ అయి ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. సరదాగా ప్రారంభమైన సెల్‌గేమ్ బాల్యాన్ని ఆపదలోకి నెట్టివేస్తుంది. ఆండ్రాయిడ్ ఫోను నిద్రించే సమయంలో దిండు వద్ద పెట్టుకోవడం, పక్కన పెట్టుకోవడం వల్ల రేడియేషన్ కారణంగా మనిషి శరీరంలో ఇమ్యూనిటీ తగ్గించడంతోపాటు క్యాన్సర్ కణాలు పెరిగే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే సాధ్యమైనంత వరకు ఆండ్రాయిడ్ ఫోన్లను దూరంగా ఉంచడమే ఉత్తమం.

వైసీపీలో ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్వీర్యం

- ఇసుక కొరత లేకుండా చూడండి
- వారంలో ఓపెన్ ర్యాంపులు
- రూ.145కే టన్ను ఇసుక
- తూర్పు సమీక్షలో మంత్రి నిమ్మల



జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల సమీక్షలో మాట్లాడుతున్న గన్ని కృష్ణ చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, బత్తుల తదితరులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థ 20 ఏళ్లు వెనక్కిపోయిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆందోళన వ్యక్తం చేశారు.స్థానిక కలెక్టరేట్‌లో శని వారం జరిగిన తొలి జిల్లా రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.గత ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయ న్నారు.సం క్షేమం పేరుతో జగన్ రాష్ట్రాన్ని దోచుకున్నాడన్నాడు. సీఎం చంద్రనాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలు తీర్చే మంచి ప్రభుత్వం వచ్చిందని, కేంద్రంలో ప్రధాని మోదీ సహకారం అందిస్తున్నారన్నారు. జగన్ ఇసుకను దోపిడీకి వినియోగిస్తే..చంద్రబాబు ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఇసుక కొరత లేకుండా బోట్స్‌మన్ సొసైటీలను పెంచుతున్నామన్నారు. వారం రోజుల్లో ఓపెన్ రీచ్‌లు ప్రారంభమవుతాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం డీసిల్టేషన్ ర్యాంపుల వల్ల టన్ను రూ.625కు అమ్మితే తాము రూ.228కే అందిస్తున్నామన్నారు.అందులో రూ.198 బోట్స్‌మన్ సొసైటీలకే అందు తుందని.. ఓపెన్ రీచ్‌ల వల్ల గత ప్రభుత్వం రూ.475లకు అమ్మితే తాము రూ.145కే టన్ను అందిస్తున్నామన్నారు. ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు సొంత అవసరాలకు ఇసు కను వాడుకుంటే ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. కానీ విక్రయిస్తే ఉపేక్షించేలేదని..కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.ఆర్అండ్‌బీ రహదారుల్లో గుంతలను ముందుగా పూడ్చనున్నామని..తర్వాత రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యా ణ్ రూ.4500 కోట్లతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణా నికి చేపట్టిన పల్లె పండుగలో గుర్తించిన పనులను సంక్రాంతికే పూర్తిచేయనున్నామన్నారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేసింద న్నారు.రాష్ట్రంలో 1080 ఎత్తిపోతల పథకాలు ఉంటే 450 మూతపడ్డా యని చెప్పారు. దీని వల్ల 3 లక్షల ఎకరాల ఆయకట్టు బీడుగా మారిపోయిందన్నారు. వాటికి పున ర్జీవం ఇవ్వడంపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టారన్నారు. పోలవరం ప్రాజెక్టు డయా ఫ్రంవాల్ వైసీపీ వైఖరి వల్ల పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. నవంబరు రెండో వారంలో సీఎం చంద్రబాబు పోలవరం వచ్చి పనులు ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్వహణకు ఏడాదికి రూ.980 కోట్లు అవసరం కాగా, వైసీపీ కంటితుడుపుగా కేవలం రూ.270 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు.మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా ముందుకెళతామని తెలిపారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేకుండా చూడడం కోసం చర్యలు తీసుకున్నామని..కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు ఎన్నికలు జరిపించాలని, గ్రామాల విలీనం వంటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసి సిబ్బందిని క్రమబద్ధీకరించాలని సూచించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ, కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ టెండర్ల ప్రక్రియను చేపట్టాలన్నారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చాగల్నాడు, వెంకటనగర్, పుష్కర లిఫ్ట్ పథకాలను పునరుద్ధరించి సాగునీటిని అందించాలని కోరారు.గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కారణంగా కొవ్వాడ,ఎర్రకాలువ గట్లు బలహీనపడ్డాయని,ఈ ప్రాంతంలో సుమారు 6 వేల ఎకరాల వరకూ ముంపునకు గురైందన్నారు.కాలువల ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపించి..పనులు చేపట్టాలని కోరారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రిక పరికరాలు,డ్రిప్, ట్రాక్టర్లు సబ్సిడీపై రైతులకు అందజేయాలన్నారు.సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్, డీఆర్‌వో జి.నరసింహులు, కమిషనర్ కేతన్‌గార్గ్, ఆర్డీవో కృష్ణనాయక్, సీపీవో అప్పలకొండ పాల్గొన్నారు.



7 అస్సాగో ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత



సొమ్మసిల్లి పడిన మహిళ

గుమ్మళ్లదొడ్డిలో దీక్ష భగ్నం

అస్సాగో ఫ్యాక్టరీ తొలగించాలని డిమాండ్

కొత్తతుంగపాడులో అక్రమ తవ్వకాలు

దివాన్‌చెరువు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): అక్రమమైనింగ్ వెంటనే నిలిపివేసి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కొత్తతుంగపాడులోని క్వారీల వద్ద డీసీసీ మాజీ అధ్యక్షుడు యాళ్ల మాసరయ్య ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన చేశారు. కొత్తతుంగపాడు రెవెన్యూ పరిధి స.నెం974/1లోని 88 సెంట్లు భూమి, జి.ఎర్రంపాలెంలోని స.నెం 330/4 లోగల దాదాపు 4 ఎకరాల భూమిలో అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు.దీనిపై గనులశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోడి నాగేశ్వరరావు, ఎడ్ల సత్యనారాయణ, ఆలపాటి గోవిందు, గోవిందరాజు, అబ్బులు పాల్గొన్నారు.

యువత ఉపాధికి స్కిల్ శిక్షణ

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు జాబ్‌మేళా
- 1500 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చిత్రంలో బీవీఆర్ చౌదరి, ప్రిన్సిపాల్ రామచంద్ర టీడీపీ నాయకులు

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి కల్పించాలన్నదే ప్రధాన లక్ష్యమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగర ప్రజలకు ఇచ్చిన డిక్లరేషన్‌లో ప్రధానమైన ఉద్యోగ,ఉపాధి స్కీమ్‌లో భాగంగా తన సొంత ఖర్చులతో 80 కంపెనీలను రప్పించి ఆర్ట్స్‌కళాశాలలో శనివారం జాబ్ మేళా ఏర్పాటు చేశారు. వేలాదిగా నిరుద్యోగులు తరలివచ్చారు.తొలుత జాబ్‌మేళా ప్రారంభిం చారు. ఇంటర్వ్యూలు నిర్వహించగా 1500 మందికి ఉద్యోగాలు వచ్చాయి.. ఆఫర్ లెటర్స్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అందించి మాట్లాడారు.యువత గత ఐదేళ్లుగా ఎటువంటి ఉద్యోగావకాశాలు లేక తీవ్ర ఇబ్బం దులు పడ్డారని చెప్పారు. తన పుట్టిన రోజున ఒక మంచి కార్యక్రమాన్ని తలంచి తన సొంత ఖర్చులతో 80 కంపెనీలతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.అమరావతి సొల్యూషన్స్. భవాని చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ప్రతి మూడు నెలలకు వంద మంది నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్‌లో స్కిల్స్ శిక్షణ ఇస్తామన్నారు. ఒక్కో అభ్యర్థికి రూ.20 వేలు ఖర్చవుతుందని అందులో రూ.15 వేలు ఫీజు భవానీ చారిటబుల్ ట్రస్టు భరిస్తుందని అభ్యర్థి రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలు వస్తాయన్నా రు. కార్యక్రమంలో ఆర్‌డీవో కృష్ణనాయక్, ఆర్ట్స్‌కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

కొబ్బరన్నం కాంబినేషన్..

ఇప్పుడు ఇదే ట్రెండింగ్.. మెనూలో కొబ్బరి అన్నంతో వెజ్, నాన్‌వెజ్ వంటకాలు





కాస్త జిహ్వా చాపల్యం ఉన్న వాళ్లకు వెజ్ అయినా, నాన్‌వెజ్ అయినా బిర్యానీ మాట వినబడగానే నోరు జివ్వున లాగుతుంది. కానీ మసాలాలు, పొడులు, నూనె వగైరా చాలామంది ఉదరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. ఇక నాణ్యత లేని సరుకులతో చేస్తే అనారోగ్యమే. బిర్యానీ కంటే సులభంగా తయారయ్యే ఆరోగ్యమైన వంటకం ఈమధ్య ట్రెండింగ్‌లోకి వచ్చింది. అదే కొబ్బరన్నం. మన పూర్వీకులు వండి వార్చిన వంటకమే. కాకపోతే ఇవాళ రెస్టారెంట్లలో ఈ డిష్‌కి విపరీతమైన ఆదరణ పెరిగింది. మసాలా పొడులు, ఎసెన్సులు వంటివి లేకుండానే.. వంటనూనె వాడకుండానే తయారైపోతుంది. పైగా కొబ్బరి పాలతో చేసే ఈ అన్నం ఆరోగ్యానికీ మేలు. దీంతో ఈమధ్య కొబ్బరి అన్నం (కోకోనట్ రైస్) మెనూలో చేరిపోయింది. నిజానికి మన ఇంట్లో ఇప్పటికీ పిల్లలకు లంచ్ బాక్స్‌లోకి తరచూ రెడీ చేసే రెసిపీ కూడా ఇదే. కొబ్బరన్నం వెజ్‌తోను, నాన్ వెజ్ అయితే కోడికూరతో కలిసి వేడివేడిగా లాగించేస్తే అబ్బో దాని రుచే వేరు.

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం/ కాకినాడ కార్పొరేషన్)

ఈరోజు ఆదివారంకదా.. ఏమిటి స్పెషల్ అనుకోని వారుండరు. అటు వెజ్, ఇటు నాన్‌వెజ్ ప్రియులు ఏదొక ప్రత్యేక వంటకం కోసం ఎదురు చూస్తారు. ఇంట్లో కాకుండా బయటకు వెళితే కచ్చితంగా బిర్యానీ మెనూలో ఆర్డర్ చేస్తారు. ఇది కూడా వెజ్, నాన్‌వెజ్‌లో ఓ డజను రకాలు. కానీ మషాల్చాలు, రకరకాల పొడుల ఘాటు కొందరిని ఇబ్బందిపెడుతుంది. ఈనేపథ్యంలో కొబ్బరన్నం కాంబినేషన్‌లో అనేక వంటకాలను ఈమధ్య రెస్టారెంట్లు తమ మెనూ కార్డులో చేర్చాయి. పేరున్న హోటళ్ల నుంచి చిన్న చిన్న కర్రీ పాయింట్ల వరకు కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలను అందిస్తున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర నగరాల్లో అయితే కొబ్బరన్నంతో కలిపిన వంటకాలను మాత్రమే విక్రయించే ప్రత్యేక కిచెన్ పాయింట్లూ వెలిశాయి. మరికొందరు సేంద్రియ ఉత్పత్తులతో కూడిన కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలు తమ స్పెషల్ అని ప్రకటించుకుంటున్నాయి. ఎందుకింత క్రేజ్ పెరిగిందో తెలియదు గాని వీటికి ఆర్డర్లు బాగా పెరిగాయి. నిజానికి కొబ్బరన్నం మనకు కొత్తేమీ కాదు. పూర్వీకుల నుంచి ఉన్న వంటకమే. ఇప్పటికీ వంటిళ్లలో పిల్లల కోసం అప్పుడప్పుడూ స్పెషల్ రెసిపీ అంటూ తల్లులు చేస్తూనే ఉంటారు. దీన్ని మార్కెట్ పట్టుకుంది. నూనెలు, పెద్దగా మషాలాలు లేకుండా స్పెషల్ ఫుడ్ కావాలనుకునే వారి కోసం కోకోనట్ రైస్‌తో కూడిన వంటకాలను అందిస్తున్నారు. మీరూ ఓసారి చూసేయండి మరి.

ఇలా వండేద్దాం..

రెండు కప్పులు (సుమారు పావుకిలో) బియ్యానికి సరిపడా ఏమి కావాలో చూద్దాం. ముందుగా కొబ్బరి పాలను సిద్ధం చేసుకోవాలి. అప్పటికప్పుడు చేస్తేనే రుచి తగ్గకుండా ఉంటుంది. మరీ లేత, మరీ ముదురుకాకుండా మధ్యస్తంగా ఉండే ఒక మీడియం సైజు కొబ్బరికాయను తీసుకోండి. దానిని బద్దలుకొట్టి నీటిని తీసేయండి. కొబ్బరిని వేరుచేసి చిన్న ముక్కలుగా కోసి మిక్సీలో వేసి ఓ గ్లాసు నీళ్ల వెయ్యండి. మిక్సీ చేసి జ్యూస్ జల్లెడ, టీ వడకట్టు, శుభ్రమైన క్లాత్‌లో పోసి పాలను వడకట్టుకోవాలి. ఓ రెండు సార్లు ఇలా చెయ్యవచ్చు. పాలు మరీ చిక్కగా ఉంటే అన్నం వెగటు వస్తుంది. మరీ పల్చగా ఉంటే రుచి తగ్గిపోతుంది. అందువల్ల మధ్యస్తంగా ఉండేలా పాలను తీసుకొని పక్కన పెట్టుకోండి. వండటానికి ఎలక్ట్రికల్ లేదా మామూలు కుక్కర్ అయితే బాగుంటుంది. బియ్యాన్ని శుభ్రంగా కడిగిన తర్వాత దానిలో ఒకటికి రెండు లెక్కన ముందుగా రెడీ చేసుకున్న పాలు వేయాలి. మూడొంతుల పాలు ఒక వంతు నీళ్ల ఉన్నా ఫర్వాలేదు. మధ్యకు చీరిన మూడు పచ్చిమిర్చి, సరిపడా ఉప్పు, చిన్న దాల్చిన చెక్క, నాలుగు చొప్పున యాలికలు, లవంగాలు, పలావు ఆకులు, మరాఠి మొగ్గలు, స్టార్ పువ్వు ఒకటి, కొత్తిమీర, ఒకవేళ ఉంటే చాలా తక్కువగా పుదీనా ఆకులు, జాజికాయ, జాపత్రి, జీలకర్ర, షాజీరా వేసుకోవాలి. పసుపు (రంగుకోసం), మిరియాలు, కరివేపాకు, జీలకర్ర, పెరసపప్పు, జీడిపప్పు, తరిగిన అల్లం వంటివి మీ ఇష్టం. అల్లం, వెల్లుల్లి పేస్టు, వంటనూనె, మషాలా తదితర పొడులు అవసరం లేదు. ఇప్పుడు కుక్కర్ మూత పెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ఆవిరి తగ్గిన తర్వాత మూత తీసి చూస్తే నోరూరించే.. ఆరోగ్యకరమైన వేడి వేడి కొబ్బరి అన్నం సిద్ధం. మాంసాహారులైతే కోడికూర (గ్రేవీగా) తప్పనిసరిగా ఉండాల్సిందే. శాకాహారులైతే బంగాళా దుంప, మష్‌రూమ్, పన్నీరు, జీడిపప్పు ఇలా ఇష్టమైన కాంబినేషన్‌తో లాగించేయవచ్చు. రైతా(ఉల్లి చెట్నీ) మీ ఇష్టం.





● ఆరోగ్య విలువలు ఇవీ..


కొబ్బరి పాలు సహజ మాయిశ్చరైజర్‌గా పని చేస్తాయి. కొబ్బరి పాలలో విటమిన్ ఏ,బీ,సీ, కాల్షియం, పా స్పరస్, ఐరన్, సహజ పిండి పదార్థాలు, ప్రొటీన్స్ పుష్కలంగా లభిస్తాయి. కొబ్బరిలో ఉండే సైటోకైనిన్స్ చర్మంలోని వృద్ధాప్యపు ఛాయలను నెమ్మదించేలా చేస్తాయి. కొబ్బరిలోని ఎంజైములు ఉదరంలోని యాసిడ్ రిఫ్లెక్స్‌ని అరికడతాయి. కొబ్బరి పాలు జీవక్రియలను పెంపొందిస్తాయి. బరువును తగ్గిస్తాయి. మంచి కొలెస్టరాల్, జుట్టు వృద్ధి, చర్మానికి నిగారింపు వస్తుంది. గుండెకు మేలు చేస్తుంది. 100 గ్రాముల కొబ్బరిపాలలో 230 కిలోల క్యాలరీల శక్తి, 2గ్రా. డైటరీ ఫైబర్, 23.8గ్రా. కొవ్వులు, 3.3గ్రా. చక్కెర, 3గ్రా. ప్రొటీన్లు, 5గ్రా. కార్బొహైడ్రేడ్స్, 15గ్రా.కాల్షియం, 3గ్రా.విటమిన్ సి, 0.7మి.గ్రా జింక్, 100మి.గ్రా భాస్వరం, 37 మి.గ్రా మాంగనీస్, 37మి.గ్రా మెగ్నీ షియం, 2 మి.గ్రా ఇనుము, 265మి.గ్రా పొటాషియం ఉంటాయి.



ఆరోగ్యకరమైన ఆహారం కోరుకునే వారికి కొబ్బరన్నం ఇప్పుడు స్పెషల్ రెసిపీ. ఇందులో పెద్దగా మసాలాలు, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్ వాడం. తాజా కొబ్బరి పాలు, సోనామసూరీ బియ్యంతోపాటు యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, అనాస పువ్వు వంటివి మాత్రమే వాడతారు. ఇది ఆరోగ్యం. తేలికగా జీర్ణం అవుతుంది. కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలను మాత్రమే విక్రయిస్తాం.

- టి.చరణ్, ఉగ్గు ఫుడ్స్, వలసపాకల, కాకినాడ

కవిత్వమై.. పుట్టింది!



- 'కవిసంధ్య' 50 సంచికల విజయయాత్ర
- నేడు యానాంలో స్వర్ణోత్సవ సభ
- 13 మందికి ప్రతిభా పురస్కారాలు



పత్రిక నిర్వహణ కష్టమైన పని. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. అందులోనూ కేవలం కవిత్వం మీదనే ఒక పత్రిక నడపడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు.. ఈ బాధ్యతను ప్రముఖకవి శిఖామణి ఎప్పుడో భుజానకెత్తుకున్నారు. యానాం కేంద్రంగా కవిత్వమే ప్రధానంగా 'కవిసంధ్య' ఆరంభమైంది. ఎనిమిదేళ్ల కిందట మొదలైన ఈ ప్రయాణం తాజాగా స్వర్ణోత్సవ సంచికను తీసుకువచ్చింది. ఈ సందర్భంతోపాటు ఏటా కవిసంధ్య పేరిట జరిగే పురస్కారాల వేడుకను కూడా ఈనెల 27 ఆదివారం ఉదయం తొమ్మిదిన్నరకు యానాంలోని గీతాభవన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, అనంతరం వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాలను ప్రదానం చేస్తారు. అలాగే శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవిసమ్మేళన కార్యక్రమాలు జరుగున్నాయి. అదేవిధంగా కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను మరో 13 మందికి అందజేయనున్నారు. కవిసంధ్య సంపాదకుడు, కళారత్న శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, అతిథులుగా సాహితీవేత్తలు డాక్టర్ దీర్ఘాశి విజయ్ భాస్కర్, డా.సి.మృణాళిని, డా.వీరలక్ష్మీదేవి, డా.ఆర్.సీతారాం, డా.వరుగు భాస్కర్‌రెడ్డి, దాట్ల దేవదానంరాజు హాజరవుతారు.

శిఖామణి ఏమంటున్నారంటే..



నాడు 16 పేజీలతో తొలి అడుగు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయిన తర్వాత 2015లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉద్యోగ విరమణ పొందాను. అప్పటికే రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో కవిసంధ్య సాహిత్య కార్యక్రమాలను నిర్వహించింది. రాష్ట్ర విభజన తర్వాత కవిసంధ్య కార్యక్షేత్రాన్ని నా స్వగ్రామం కేంద్రపాలిత ప్రాంతమైన యానాం మార్చాను. యానాంలో 2016 ఏప్రిల్ 8న ఉగాది వేడుకలకు కవిసంధ్య కవిత్వ పత్రికగా వెలువడింది. ఏప్రిల్-మే ద్వైమాసిక సంచికగా యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులు ముఖచిత్రంలో 16 పేజీల సంచికగా వెలువడింది. ఇప్పుడు స్వర్ణోత్సవ సంచిక 136 పేజీలతో వెలువడుతోంది.

కవిత్వానికి పత్రిక కావాలి

ఒకప్పుడు తెలుగులో కథకు, నవలలకు ప్రత్యేక పత్రికలుండేవి. ఆంధ్రజ్యోతి వీక్లీలో ఈవారం కవిత పేరుతో ఒక పేజీ కేటాయించేవారు. సండే మ్యాగజైన్లో కూడా కవిత్వానికి ఒక పేజీ ఉండేది. ప్రస్తుతం నేను ప్రముఖ కవులు, రచయితల సంతకాలు సేకరించి కవిత్వ పేజీ అవసరాన్ని గుర్తుచేస్తున్నాను. కవిత్వానికి స్థల నిర్దేశం చేయడం పోలీసింగ్ లాంటిది. కవిత్వానికి పోలీసింగ్ మంచిదికాదు. గతంలో కంజిర, సంతకాలు, జముకు, చైతన్య కవిత వంటి పత్రికలు వచ్చి ఆగిపోయాయి. కవిత్వానికి ఒక పత్రిక అవసరం.

ప్రయత్నం... ప్రయాస కాదు..

కవిసంధ్య సన్నాహక సభలో మిత్రులు అన్నట్టు రచనలు వచ్చినంతగా చందాలు రావన్నది అనుభవం మీద తెలిసింది. తొలి సంవత్సరంలో సాహితీ మిత్రులు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. తర్వాత రచనలు అడిగినంత చనువుగా చందాలు, రెన్యూవల్స్ అడగలేకపోయాం. కవిసంధ్య తయారీ హైదరాబాద్‌లో.. ప్రింటింగ్ విజయవాడలో.. పోస్టింగ్ యానాంలో.. ఒక అరడజను మిత్రులతో కలిసి యానాం కవిసంధ్య ఆఫీసులో కూర్చుని పత్రికలకు పోస్టింగ్‌కు సిద్ధం చేసేవాళ్లం. ఇప్పటికీ ఇదే కార్యక్రమం. అయినప్పటికీ ఇది ఆనందమేకానీ ప్రయాసకాదు.

జ్ఞాపకాలు, సన్నివేశాలు...

పత్రిక ప్రారంభించాక కొత్తలో ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి పది వేల చెక్కును పంపించారు. అది కవిసంధ్య పేరు మీద ఉంది. అప్పటికి కవిసంధ్యకు ఇంకా బ్యాంకు అకౌంట్ తెరవలేదు. అదే విషయం ఆమెకు చెబితే నా పేరున మరో చెక్కు పంపారు. కవిసంధ్య పేరున ఉన్న చెక్కును తిరిగి పంపుతుంటే వద్దు అకౌంట్ తెరిచాక అది కూడా బ్యాంకులో వేసుకోండి అన్నారామె. పేరు చెప్పడానికి ఇష్టపడని అజ్ఞాత సౌజన్యమూర్తులూ కొందరు కవిసంధ్యకు అండగా ఉన్నారు. నాకు కవిగా పదుల సంఖ్యలో చిన్నా పెద్దా పురస్కారాలు వచ్చాయి. అయితే ప్రముఖ పద్యకవి అనుమాండ్ల భూమయ్య ఇటీవల పద్యకవి సత్కార సభలో కవిసంధ్య పత్రిక సంపాదకుడిగా నన్ను పిలిచి సత్కరించడం కవిసంధ్యకు, సంపాదకుడిగా నాకు దక్కిన తొలి సత్కారం ఇది.

ఇక భవిష్యత్తు ఆలోచన...

కవిసంధ్య 50 సంచికలను మనసు ఫౌండేషన్ రాయుడు సౌజన్యంతో డిజిటలైజేషన్ చేసి భవిష్యత్తరాలకోసం భద్రపరచాలనే ఆలోచనగా ఉంది. వచన కవిత్వం వందేళ్లు పూర్తి చేసుకోబోతున్న తరుణంలో వందేళ్ల వచన కవిత పేరుతో ఒక సంకలనం తెచ్చే యోచన ఉంది. - ఆంధ్రజ్యోతి/యానాం





సభలో మాట్లాడుతున్న చందు సుబ్బారావు, మృణాళిని

సోమసుందర్ సాహిత్యం.. నేటి తరానికి తెలియజేయాలి

ఆవంత్స శత జయంతి సభలో సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని

పోర్టుసిటీ (కాకినాడ), అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వజ్రాయుధకవి ఆవంత్స సోమసుందర్ సాహిత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత సాహితీవేత్తలపై ఉందని ప్రముఖ రచయిత్రి, సాహిత్య అకాడమీ (న్యూఢిల్లీ) తెలుగు సలహా మండలి కన్వీనర్ సి.మృణాళిని అన్నారు. కాకినాడ గాంధీ భవన్‌లో సోమసుందర్ శత జయంతి సభను సాహిత్య అకాడమి, క్రియా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో మృణాళిని మాట్లాడుతూ సోమసుందర్ 100కుపైగా పుస్తకాలు రాశారన్నారు. ప్రముఖ సాహితీవేత్త చందు సుబ్బారావు మాట్లాడుతూ సోమసుందర్ ఆత్మకథలో ఆయన జీవితంలో జరిగిన సంఘటనలన్నీ ఉన్నాయన్నారు. జీవితచరిత్ర అంటే ప్రతి సంఘటన ఉండాలని ఆయన కోరుకునేవారని, ఆయనతో అప్పట్లో సన్నిహితంగా మెలిగిన స్నేహితురాలి గురించీ జీవిత చరిత్రలో రాయడం ఆయనకే చెల్లిందన్నారు. డాక్టర్ జి.సీతారామస్వామి మాట్లాడుతూ సోమసుందర్ పేదల వైపు నిలబడి అభ్యుదయకవిగా పేరు తెచ్చుకున్నారన్నారు. సదస్సులో క్రియా సొసైటీ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, సాహితీవేత్తలు నందిని సిధారెడ్డి, ఎన్.ఈశ్వరరెడ్డి, బొల్లోజు బాబా, వాడ్రేవు వీర లక్ష్మీదేవి, కస్తూరి నాగమురళీశంకర్, నందూరి రాజగోపాల్, ఆర్.సీతారామారావు, మేకా మన్మథరావు, శిఖామణి, మేకా మన్మధరావులు పాల్గొన్నారు.





సర్వాంగ సుందరంగా అలంకరించిన బాలబాలాజీ ఆలయం. పక్క చిత్రంలో పవిత్రోత్సవాలకు స్వామివార్లను తీసుకుని వస్తున్న అర్చకులు

వైభవంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు

ఆధ్యాత్మికతతో కళకళ్లాడిన అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం



స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి పవిత్రోత్సవాలు పంచారాత్ర ఆగమానుసారం త్రయాహ్నిక దీక్షతో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చినజీయర్‌స్వామి శిష్య బృందం, చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో విశ్వక్సేనారాధనతో ఈ పవిత్రోత్సవాలు వేద మంత్రోచ్చరణల మధ్య ప్రారంభమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో పుణ్యహవచనం, పరిషత్ దక్షిణ రుత్విక్ వరుణ, రక్షాబంధన పూజ, అంకురార్పణాంగ వాహనం, చతుష్టానార్చనలు, అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్ర ఆదివాసం, శ్రీవారికి నవకలశ స్నపన నివేదన, మంగళ శాసనం తదితర పూజలను అర్చకులు జరిపారు. ఈ పవిత్రోత్సవాల వల్ల స్వామివారిలో తేజస్సు కలుగుతుందన్నారు. దోషాలు పరిహారం అవుతాయని, శ్రీవారి కటాక్షంతో లోకశాంతి, విశ్వశాంతి కలుగుతుందని అర్చకులు ఉత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవస్థానంలో సుప్రభాత సేవ..

బాలబాలాజీ దేవస్థానంలో ప్రతి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. శనివారం స్వామివారి మేలుకొలుపు అనంతరం తొలిహారతిని ఘనంగా జరిపారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగింది. ప్రతి శనివారం జరిగే తొలిహారతిలో భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ ఏసీ కోరారు.

వ్యవసాయాధికారులుగా పదోన్నతులు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 26: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు వ్యవసాయ విస్తరణాధికారులకు మండల వ్యవసాయాధికారులుగా పదోన్నతి ఇస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారని వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు తెలిపారు. సీతానగరం మండలంలో పనిచేస్తున్న పీవీ శ్రీనివాస్‌ను పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా, ఆలమూరు మండలంలో పనిచేస్తున్న కిషోర్‌బాబుకు తాడేపల్లిగూడెం పురుగు మందుల ప్రయోగశాలకు, కపిలేశ్వరపురం మండలంలో పనిచేస్తున్న ఐ. లక్ష్మిని కాకినాడ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా నియమించారు. శనివారం వారు బాధ్యతలు స్వీకరించారు.

పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన జీవనోపాధులు

మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్



మాట్లాడుతున్న తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు నిర్ధిష్టమైన జీవనోపాదుల ఏర్పాటు చేయాలని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శనివారం జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బందికి సమీక్ష సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు. సమీక్షలో మెప్మా పీడీ బి.ప్రియంవద, కమిషన్లు, మెప్మా సిబ్బంది, టీటీఈలు, సీఎంఎం, టీఎంసీ, సీవో, డీఈవోలు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీవారి శ్రీపుష్పోత్సవం

- శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనసేవ
- ఆకట్టుకున్న సహస్ర దీపాలంకరణ సేవ
- మోహిని అలంకరణలో చంద్రప్రభ వాహనసేవ
- ఆరోరోజు బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద మంత్రాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు విద్యుత్, పుష్పాలంకరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఆరోరోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వసంత మండపంలో వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించగా ఉత్సవమూర్తులు కొలువుదీరి పూజలందుకున్నారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, సప్తకలశారాధన, మహాస్నహనపనము, ప్రధాన హోమాలు నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు చేతులు మీదుగా మహా పుష్పయాగం జరిపారు. భక్తులు పుష్పయాగం తిలకించి మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారు సూర్యప్రభ వాహనసేవలో విహరించారు. రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు దీపాలంకరణ సేవలో పాల్గొని తన్మయత్వం పొందారు. రాత్రి మోహిని అలంకరణలో శ్రీవారు చంద్రవాహన వాహనంలో ఆశీనులయ్యారు. మిరుగొట్టు గొలిపే బాణసంచా కాల్పులు, విద్యుత్ వెలుగులు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారు చంద్రప్రభ వాహనంలో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారులు భక్తులను రంజింప చేశాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులతో పాటు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో ...

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం స్వామివారికి హోమములు, లోకకళ్యాణార్థం శ్రీ శ్రీనివాస కళ్యాణం, రాత్రి రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు గజవాహనసేవ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొంటారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శన చేయనున్నారు.



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న పండితులు



స్వామివారి శ్రీ పుష్పోత్సవం జరుపుతున్న వేద పండితులు



బ్రహ్మోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న దృశ్యం



సూర్యప్రభ వాహనసేవలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న నాగమణి

సత్యదేవ నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం

అన్నవరం, అక్టోబరు 26: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకం, గోసంరక్షణ ట్రస్టుకు శనివారం కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన బోను నాగమణి రూ.2 లక్షలు విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో విభాగ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌కు అందజేశారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.



పాపికొండలు వెళ్లొద్దాం...

దేవీపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల తర్వాత పాపికొండలు విహార యాత్ర శనివారం ప్రారంభమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని పోశమ్మగండి వద్ద ఉన్న బోటు పాయింట్ నుంచి కావేరి బోటులో సుమారు 40 మంది పర్యాటకులు వెళ్లారు. ఈ బోటును దేవీపట్నం ఎస్ఐ షరీఫ్, తహసీల్దారు రామకృష్ణ పరిశీలించారు.

విచారణ పక్కదారి!

టేకు చెట్లు మాయం వ్యవహారంలో ఫారెస్టు అధికారులను రక్షించేందుకు రంగం సిద్ధం.... ఇందుకూరు అటవీ రేంజ్‌లో బాగోతం

దేవీపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టేకు చెట్లు మాయం కేసులో విచారణ సక్రమంగా జరగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండల పరిధిలోకి వచ్చే ఇందుకూరు అటవీ రేంజ్‌లో రమణయ్యపేట వద్ద 69 టేకు చెట్లను దొంగలు రాత్రికి రాత్రే తరలించుకుపోయారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.60లక్షలకు పైగా ఉంటుందని ఒక అంచనా. సెప్టెంబరు 28న టేకు చెట్లు మాయమయ్యాయి. టేకు చెట్లను ఎవరు నరికించారు... ఎక్కడికి తరలించారు... ఇందులో అధికారుల పాత్ర ఉందా లేదా అనే కోణంలో విచారణ జరగాల్సి ఉంది. కానీ అధికారులు అసలు విషయాల జోలికి వెళ్లకుండా టేకు చెట్ల మొదళ్లను చూసి మాత్రమే ప్రాథమిక నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. గత నెల 30న ఇందుకూరు రేంజ్ అధికారి దుర్గాకుమార్ బదిలీ అయ్యారు. అంతకు రెండు రోజులు ముందుగానే 69కి పైగా టేకు చెట్లను నరికి



రమణయ్యపేటలో టేకు చెట్టును నరికేయగా మిగిలిన మోడు

తరలించుకుపోవడంలో అటవీ శాఖాధికారుల పాత్ర ఉందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి తోడు సెక్షన్ ఇన్‌చార్జి అధికారి, మరో సెక్షన్ అధికారి టేకు చెట్ల దొంగకు సహకరించారనే అనుమానాలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా టేకు చెట్ల విలువ రూ.60లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం సదరు సెక్షన్ ఆఫీసర్‌తో పాటు రేంజ్ అధికారిపైనా కఠిన చర్యలు ఉండే అవకాశాలుండడంతో విచారణను నీరుగార్చి టేకుచెట్ల విలువను ఐదారు లక్షలు తక్కువగా విచారణ నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. ఈ వ్యవహారమంతా బదిలీపై వెళ్లిపోయిన రేంజ్ అధికారిని రక్షించేందుకేనని గుసగుసలు వినిపిస్తున్నాయి.

వాస్తవానికి టేకు చెట్లు మాయమైన రెండు రోజుల్లోనే దొంగలను పట్టుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు ఆ దిశగా విచారణ జరపలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొందూరుకు చెందిన ఒక వ్యక్తి (ప్రస్తుతం సీతానగరం) టేకు చెట్లను అధికారుల అండతో తరలించుకుపోయాడని మండలంలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కానీ 60 లక్షల వ్యవహారంపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరపాల్సి వుంది. అయితే దేవీపట్నం సెక్షన్ అధికారి బాపిరాజును ప్రాథమిక విచారణాధికారిగా నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మంటల్లో చిక్కుకుని వృద్ధురాలి మృతి

పెద్దాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్ కాలనీలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. ఓ వృద్ధురాలు మృతి చెందినట్టు ఏడీఎఫ్‌వో



ఎం.శ్రీహరి జగన్నాథ్ తెలిపారు. రాజీవ్ కాలనీలో కనకాల సత్తిబాబు, అతడి భార్య బూరమ్మ (75) నివాసముంటున్నారు. ఇంట్లో వంట చేసుకునే సమయంలో ఎగసిపడిన నిప్పురవ్వల కారణంగా మంటలు వ్యాపించాయి. సామాన్లు తీసుకుందామని ప్రయత్నం చేసే సమయంలో బూరమ్మ మంటల్లో చిక్కుకుపోయింది. స్థానికులు అతికష్టం మీద బయటకు తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం సంభవించింది.

మహద్భాగ్యం

ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాల సందర్శన

టెంపుల్ టూరిజం బస్సును ప్రారంభించిన పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

తొలి యాత్రలో పాల్గొన్న 18 మంది



రాజమహేంద్రవరంలో బస్సు యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్. చిత్రంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల, నల్లమిల్లి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఆరు పుణ్య క్షేత్రాలను ఒకేరోజు దర్శనం చేసుకునేలా బస్సు ఏర్పాటు చేశారు. శనివారం దానిని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్ సమీపంలోని టూరిజం కార్యాలయం వద్ద మంత్రి కందుల దుర్గేష్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టూరిజం బోర్డు సభ్యులు గంటా స్వరూపదేవి, వాసిరెడ్డి రాంబాబు, టూరిజం రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. 20 మంది యాత్రికులతో బస్సు బయల్దేరింది. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకాన్ని పరుగులు పెట్టించాలన్న ఉద్దేశ్యంతో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఒక రోజు బస్సు యాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి, అన్నవరం సత్యనారాయణ స్వామి, పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి, సామర్లకోట భీమేశ్వరస్వామి, బిక్కవోలు లక్ష్మీగణపతి, కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయాల సందర్శన అనంతరం రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో గోదావరి హారతి తిలకించేలా ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వదేశీ దర్శన్, ప్రసాద్‌లతో పాటు ఎకో అడ్వెంచర్, వెల్‌నెస్, టెంపుల్ టూరిజంలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. వీటన్నిటినీ కలిపి టూరిజం సర్క్యూట్లుగా చేసి సత్ఫలితాలు సాధించాలని భావిస్తున్నామన్నారు. రుషికొండ బీచ్ బ్లూఫ్లాగ్ బీచ్‌గా సర్టిఫికెట్ పొందిందన్నారు. దానితో పాటు కాకినాడ, సూర్యలంక, రామాపురం, నెల్లూరు జిల్లా మైపాడు బీచ్‌లు బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా రూపాంతరం చెందేందుకు కృషి చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.



అన్నవరం దేవస్థానంలో...

అన్నవరం: టెంపుల్ టూరిజంలో భాగంగా 18మంది తొలి ప్రయాణం చేశారు. అన్నవరం సత్యదేవుని సన్నిధికి విచ్చేసిన వారికి పీఆర్వో విభాగ అధికారులు బలువు సత్యశ్రీనివాస్, ఎం.గణపతిరావు ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు మాట్లాడుతూ ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాలను దర్శించడం, చివరిగా గోదావరి హారతిలో పాల్గొనడం ప్రత్యేక అనుభూతి కలిగించిందన్నారు.

పిఠాపురం: టెంపుల్ టూరిజంలో భాగంగా 18మంది భక్తులు పాదగయ క్షేత్రానికి వచ్చారు. వారికి ఆలయ ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది వారికి దర్శనాలు చేయించారు. భక్తులకు వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు.





ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు, దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమే ముఖ్యమా!

దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎంపీ హర్షకుమార్

గుమ్మళ్లదొడ్డిలో 5వ రోజుకు నిరవధిక దీక్ష

గోకవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమ నిర్వహణే ప్రభుత్వానికి ముఖ్యమా అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రశ్నించారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తరలించాలని కోరుతూ తూర్పు గోదావరి జిల్లాగోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి చేపట్టిన నిరవధిక దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకొంది. దీక్షా శిబిరాన్ని హర్షకుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు తాను అండగా నిలుస్తానన్నారు. కాలుష్య పరిశ్రమల నిర్వహణ కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వేధిస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం బాధితుల పట్ల సానుకూలంగా వ్యవహరించి కంపెనీని ఇక్కడి నుంచి తరలి వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్యకారకమైన పరిశ్రమను తమ గ్రామం నుంచి తరలించాలని కోరుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చేరే విధంగా స్థానికులు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. పరిశ్రమ వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోస్టు కార్డులో పొందుపరుస్తున్నారు. అనారోగ్యానికి గురిచేసే ఈ పరిశ్రమ మాకొద్దంటూ అధిక సంఖ్యలో బాధితులు రాజమహేంద్రవరం-భద్రాచలం రహదారిపై బైఠాయించారు. దీంతో అటు రెండు కిలో మీటర్లు, ఇటు రెండు కిలో మీటర్లు మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పరిశ్రమ గేటు ఎదుట ఆందోళన చేసేందుకు బయల్దేరిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన విరమించాలని అదనపు ఎస్పీ సుబ్బరాజు మరోమారు చేసిన ప్రయత్నం ఫలించలేదు. పరిశ్రమను గుమ్మళ్లదొడ్డి నుంచి తరలిస్తామని తమకు సరైన హామీ లభించే వరకు ఆందోళన విరమించేది లేదని ఆందోళనకారులు తేల్చి చెప్పారు.

పోలీసులకు, గ్రామస్తులకు మధ్య తోపులాట

సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

కాగా ఇథనాల్ పరిశ్రమ ప్రధాన గేటు ముందు శనివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.. పరిశ్రమ నిర్వహణను తక్షణమే నిలిపివేయాలంటూ స్థానికులు గేటు ఎదుట ఆందోళనకు దిగారు. పరిశ్రమ నుంచి బయటకు లోపలకు వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం సమాచారం మేరకు భారీస్థాయిలో పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన నిలిపివేయాలని హెచ్చరించారు. అయినప్పటికీ స్థానికులు ససేమిరా అనడంతో ఆందోళనను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు.. ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది.ఈ ఘటనలో బావాజీపేటకు చెందిన ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్టు సమాచారం.. శనివారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు ఆందోళనకారులను వాహనాలు ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. దీంతో ప్రస్తుతానికి వివాదం సమసింది. నాలుగు రోజులుగా జరుగుతున్న నిరవధిక దీక్షను భగ్నం చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు, మృతుడు వెంకట రమణ (పాతచిత్రం)



ఆనందం... అంతలోనే విషాదం

- తూర్పు గోనగూడెం సమీపంలో కారును ఢీకొన్న ఐషర్ వ్యాన్... సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి
- రాజమహేంద్రవరంలో వివాహ వేడుకకు వెళ్తుండగా ప్రమాదం

రాజానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శుభ కార్యానికి ఆనందంగా బయల్దేరిన వ్యక్తి అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం తూర్పుగోనగూడెం సమీపంలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తొండంగి మండలం వలసపాకలు అగ్రహారానికి చెందిన నట్టే వెంకటరమణ (32) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ వర్క్‌ఫ్రం హోమ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం వివాహ వేడుకలో పాల్గొనేందుకు కారులో రాజమహేంద్రవరం పయనమయ్యాడు. తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సమీపానికి వచ్చేసరికి హైవే డివైడర్‌లో నుంచి దారిమళ్లుతున్న ఐషర్ వ్యాన్ కారును బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా కారు నడుపుతున్న వెంకటరమణ కారులోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. సమాచారం అందుకున్న రాజానగరం సీఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్, ఎస్ఐ మనోహర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మనోహర్ తెలిపారు. ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

సామర్లకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు చెందిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీపై కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో అధికారులకు రెండు రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. అనకాపల్లి, విశాఖపట్నం, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, పాడేరు జిల్లాలకు చెందిన ఎంపీ డీవోలు, ఈవోపీఆర్డీలు 120 మంది హాజరయ్యారు. ముఖ్య అతిథి, విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు ఎంతగానో దోహద పడతాయన్నారు. శిక్షణ అనంతరం అధికారులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అందజేశారు. ఫ్యాకల్టీలుగా జి.రమణ, కె.శ్రీనివాసరావు, ఆంజనేయులు, ప్రసాద్, నిహారిక వ్యవహరించారు. ఈ నెల 28, 29 తేదీలో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, డాక్టర్ కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అధికారులు హాజరవుతారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ చెప్పారు.

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

పట్టుకునేందుకు ప్రయత్నించగా తోసి పరారైన ప్రియుడు

తలకు బలమైన గాయంతో మధుబాబు మృతి...

నిందితులు రిమాండ్‌కు తరలింపు

తొండంగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరంలో సంచలనం రేకెత్తించిన బత్తిన మధుబాబు అనుమానాస్పద మృతి కేసులో అనుమానితులుగా ఉన్న మధు భార్య శిరీష, ఆమె ప్రియుడు పీతల ప్రశాంత్‌కుమార్‌లకు శనివారం తుని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధించిందని తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. శిరీష, ప్రశాంత్‌కుమార్ మధ్య ఉన్న వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ నెల 18న మధుబాబు ఇంటికి ప్రశాంత్‌కుమార్ వెళ్లాడు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న మధు గమనించి ఇద్దరినీ పట్టుకునే ప్రయత్నం చేయగా మధును ప్రశాంతకుమార్ తోసివేసి పరారయ్యే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మధుబాబు తలకు బలమైన గాయమై మృతి చెందగా బంధువులు సహజ మరణంగా భావించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 24న శిరీష ఇంటికి ప్రశాంత్‌కుమార్ రాగా వారిద్దరినీ పట్టుకున్న బంధువులు, గ్రామస్తులు మధుబాబు మృతికి వారే కారణమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. పూడ్చిపెట్టిన మృతదేహానికి శవ పంచనామా చేయించామన్నారు. ప్రాథమికంగా మధుబాబు తలకు బలమైన గాయమైనట్టు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా శిరీష, ప్రశాంత్‌కుమార్‌లకు రిమాండ్ విధించినట్టు జగన్మోహన్ చెప్పారు.

ధ్యానంతో మనసుకు ప్రశాంతత

- శ్రీఅరబిందో సొసైటీ ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్మన్ శ్రీనివాస్ ములుగు



రాజానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ కనీసం ఐదు నిమిషాలు దీర్ఘ శ్వాస, ధ్యానం చేయడం ద్వారా మనసుకు ప్రశాంత పొందచ్చని, ఆలోచనలను నియంత్రించవచ్చని శ్రీఅరబిందో సొసైటీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ శ్రీనివాస్ ములుగు పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలోని గైట్ అటానమస్ కళాశాలలో 'అంతర్గత సామరస్యం-సాధన' అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అంతర్గత సామరస్యం, శరీరం, మనస్సు, భావోద్వేగాల స్థిరీకరణ ద్వారా సాధ్యమని విద్యార్థులకు వివరించారు. ఒక వ్యక్తికి సాధారణంగా రోజుకు 65 వేల నుంచి 75 వేలు వరకు ఆలోచనలు వచ్చే అవకాశం ఉందని, అయితే మనసు ఏకాగ్రతతో కేవలం 8 సెకన్ల పాటు మాత్రమే ఒక అంశంపై కేంద్రీకరించగలదని చెప్పారు.

సాధారణ శారీరక వ్యాయామం మనసుకు స్థిరత్వాన్ని అందిస్తుందని, ఆచరణలో ఉన్న మనస్సు నెగిటివ్ ఆలోచనలకు లోనుకాకుండా ఉంటుందన్నారు. భావోద్వేగ నియంత్రణ సమతుల్య జీవితానికి పునాది అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధ్యానం సాధన వ్యక్తిగత జీవితంలో గొప్ప మార్పు తీసుకొస్తుందన్నారు. మన ఆహారం మనసును ప్రభావితం చేస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆహారాన్ని ఎంపిక చేసుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథిని జీజీయూ తరఫున దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానంద కుమార్, డైరెక్టర్లు టీవీ ప్రసాద్, ఆర్ఎస్ రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ కేదార్నాద్ మహాపాత్ర, మైనింగ్ విభాగం అధిపతి వినోద్, విద్యార్థులు, వరంగల్, యానాం, తెనాలి, తిరుపతి, రాజమహేంద్రవం ప్రాంతాల నుంచి అరబిందో సొసైటీ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడు

మోతుగూడెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం ఎస్ఐ శివనారాయణకు వచ్చిన సమాచారం మేరకు మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రంలోని తపతొట్టి గ్రామం నుంచి ఖమ్మం జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మయిన్‌గొల్లారి, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా నిమల్‌పాలేనికి చెందిన మయిన్ గొల్లారి, చింతూరు మండలానికి చెందిన కిలో దేబో లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పల్సర్ మోటార్ సైకిలు, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.1.10లక్షలు ఉంటుంది. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, కానిస్టేబుల్ ఎస్ఆర్‌కే రాజు, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతికి శనివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శృంగారవల్లభ స్వామి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,48,350 అన్నదాన విరాళాలు రూ.52,803, కేశఖండన ద్వారా రూ.6,120, తులాభారం ద్వారా రూ.450, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.24,630... మొత్తం రూ.2,32,353 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

29న గురువందనం

రాజమహేంద్రవరంకల్చరల్, అక్టోబర్ 26: శ్రీ శృంగేరీ శారదా పీఠాధిపతిగా జగద్గురు శ్రీశ్రీ భారతీ తీర్థస్వామి సన్యాసం స్వీకరించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా స్వర్ణోత్స వాలు జరుపుతున్నారు. స్థానిక గోదావరిగట్టున శంకర మఠంలో ఈనెల 29న గురువందన కార్యక్ర మాన్ని ఏర్పాటుచేశారు. ఆ రోజు ఉదయం నుంచి వైదిక కార్యక్రమాలు, 10 గంటలకు మహామహో పాధ్యాయ శలాక రఘునాధశర్మ ప్రసంగం ఉంటు ందని రాజమండ్రి శృంగేరీ శంకరమఠం ధర్మాధి కారి వేలూరి వెంకట్రామయ్య తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లుల కౌంటర్లు తెరిచే ఉంటాయి

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 26: జిల్లాలో విద్యుత్ బిల్లులు వసూల్ చేసే కౌంటర్లు తెరిచే ఉంటాయని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్ కుమా ర్ తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం సెలవురోజున జిల్లాలో అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలలో విద్యుత్ బిల్లులు కట్టించుకుంటారని తెలిపారు.విద్యుత్ విని యోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడి రైతులకు రుణం

పూచీకత్తు లేకుండా రూ.1.5 లక్షలు అందజేత

- పాడి రైతులకు ప్రోత్సాహం
- పశుకిసాన్ క్రెడిట్ పథకం అమలు
- రైతులకు కిసాన్ కార్డుల జారీ
- మూడేళ్ల కాలపరిమితి
- తక్కువ వడ్డీకే రుణం
- చెల్లింపులను బట్టి రాయితీ

రాజానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు పశు కిసాన్ క్రెడిట్ (పీకే సీసీ) పథకాన్ని అమల్లోకి తెచ్చి కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి చర్యలు చేపడుతోంది.ఈ మేరకు తక్కువ వడ్డీకి అధిక మొత్తంలో బ్యాంకు రుణాలు పొందేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. వ్యవసా యం, పశు పోషణపై ఆధారపడిన రైతులు, కౌలు రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ క్రెడిట్ కార్డు తీసుకోవచ్చు. కాలపరిమితి మూ డేళ్ల తర్వాత పునరుద్ధరించుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవడమిలా..

గ్రామ పశుసంవర్ధక సహాయకులు, పశు వైద్య సిబ్బంది దరఖాస్తులు పూర్తి చేసి సమీ పంలోని ప్రభుత్వ బ్యాంకుల్లో అందజేయ డం ద్వారా అర్హత కలిగిన పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు, పాస్ పుస్తకం ఇస్తారు. కేవైసీ కోసం భూమి దస్త్రాలు, పశువులకు సం బంధిం చిన ఆరోగ్య ధ్రువపత్రం, పాస్ పోర్టు సైజు ఫొ టోలు, ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డుల నకళ్లు జత చేయాలి.

ఇవీ ఉపయోగాలు..

కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా గరిష్ఠంగా ఇచ్చే రుణం రూ.3 లక్షలు. పూచీకత్తు లేకుండా మంజూరు చేసే మొత్తం రూ.1.5 లక్షలు. 40 రోజుల్లోపు తిరిగి చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుంది. గడువు దాటాక చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోగా క్రమం తప్పకుండా తిరిగి చెల్లిస్తే ఆర్‌బీఐ, నాబార్డు 3 శాతం, బ్యాంకు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ)3 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తా రు.రైతు ఒక శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలి.



రూ.1.5 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో రుణ సహాయం పొందాలనుకుంటే భూమికి సంబ ంధించిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

బహుళ ప్రయోజనాలు

క్రెడిట్ కార్డులతో పాడి రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. కార్డును సక్రమంగా వినియోగిస్తే ఎలాంటి వడ్డీ భారం లేకుండానే ఆర్థిక అవసరాలు తీరుకోవచ్చు. ప్రతి మండలంలో పాడి రైతులకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. రాజానగరం మండలంలో 1200 దరఖాస్తులు లక్ష్యం కాగా 646 దరఖాస్తులు బ్యాంకు అధికారులకు సమర్పించాం.

- డాక్టర్ ఎం.సత్యనారాయణ మూర్తి, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు



రాజమహేంద్రవరంలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



అనపర్తిలో టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి సతీమణి సత్యవతి

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

● తొలి సభ్యత్వాలు తీసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి, గన్ని

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక 43వ డివి జన్ స్కేటింగ్ కోర్టు వద్ద శనివారం మాజీ కార్పొ రేటర్ కంటిపూడి వెంకట పద్మావతి అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదులో ఆయన ముఖ్యఅతి థిగా హాజరయ్యారు. ఈసందర్భంగా టీడీపీ సీని యర్ నేత గన్నికృష్ణతో కలిసి మొదటి మూడు సభ్యత్వాలు తీసుకున్నారు. తొలి సభ్యత్వాన్ని గన్ని కృష్ణ, రెండవ సభ్యత్వం ఎమ్మెల్యే ఆదిరెడ్డి, మూ డో సభ్యత్వం మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిల పేరున తీశారు. ఈసందర్భంగా ఆదిరెడ్డి మాట్లా డుతూ టీడీపీ సభ్యత్వం కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నాయకులు కుంటిపూడి శ్రీనివాస్, మరుకుర్తి రవియాదవ్. యాళ్ల ప్రదీప్, చల్లా వెంకటేష్, శేఖర్‌రెడ్డి, జ వ్వాది నారాయణరావు, విశ్వం, కోటిప్రసాద్, జ వ్వాది మురళీకృష్ణ, ఆదారి లక్ష్మీనారాయణ, మళ్ళ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుస్థాయిలో టీడీపీ సభ్యత్వాలు నమోదు కావాలి

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి

అనపర్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు జరగాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ తరపున పోటీచేసి ఎమ్మె ల్యేగా గెలుపొ ందడంతో టీడీపీ బాధ్యతలను ఆయన తనయు డు మనోజ్‌రెడ్డి స్వీకరించారు. శనివారం అనపర్తి లోని ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండ పంలో ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమో దు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి సత్యవతి రూ.1లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్య త్వాన్ని నమోదు చేసుకున్నారు. ఇన్ చార్జిగా ఉన్న మనోజ్‌రెడ్డి, టీడీపీ వాణిజ్య విభా గం జిల్లా అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి లు తలో లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని పొం దారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి తమ కుటుంబం టీడీ పీతో మమేకమై ఉందని నియోజకవర్గంలో తమ ది పెద్ద కుటుంబమని అన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుపై నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదా నరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి శేషార త్నం, జుత్తుగ సూర్యకుమారి, బేరా వేణమ్మ, నా లుగు మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ యూ నిట్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వంతో కొండంత అండ'

గోకవరం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతీ ఒక్కరికీ కొండంత అండ లభిస్తుందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. మండలంలోని తంటికొ ండ, గాదెలపాలెం, ఇటికాయిలపల్లి గ్రామాలలో శనివారం జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భం గా ఆయా గ్రామాలలో నవీన్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతీ ఒక్కరికీ రూ.5 లక్షల బీమాసౌకర్యం కల్పిస్తుందని, చంద్రన్న బీమా కూడా తొందరలోనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు మంగరౌతు రాము, జనపరెడ్డి సుబ్బారావు, కన్నబాబు, అడపా భరత్, ఉంగరాల రాము, పాలూరి బోస్, పెద్దాడ వెంకన్నదొర, బదిరెడ్డి అచ్చన్నదొర, గళ్ళా రాము, నాగం వెంకటపతి, గంగాధర్ పాల్గొన్నారు.



మొదటి సభ్యత్వం అందజేస్తున్న జ్యోతుల నవీన్

ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు ఈవెంట్స్, మెయిన్స్ నిర్వహించాలి

● డీవైఎఫ్ఐ డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం కూటమి ప్రభుత్వం చొరవ తీసు కోవాలని, ప్రిలిమ్సి పరీక్షల్లో అర్హత సాధించి న వారికి వెంటనే మెయిన్స్, ఈవెంట్స్ నిర్వ హించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై. రాము డిమాండ్ చేశారు. ఈమేరకు శనివా రం రాజమహేంద్రవరంలో జరిగిన డీవైఎ ఫ్ఐ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని ఖాళీ పో స్టులను భర్తీ చేయాలని, జాబ్ కేలండర్ ప్ర కటించాలని కోరారు. ఈ సమావేశంలో నా యకులు డి అశోక్‌కుమార్, జి ప్రసన్నకు మార్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీ అధ్యక్షుడికి ఎమ్మెల్యే బత్తుల అభినందన

కోరుకొండ, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం కాపవరం మత్స్యకార సొసైటీ నూతన పాలక వర్గాన్ని శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అభినందిం చారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సొసైటీ పాలక వర్గం కొండేటి ధర్మరాజు, ఇతర సభ్యులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యకార సొసైటీ పాలక వర్గాన్ని పూలమాలలు వేసి శాలువాలతో సత్కరిం చారు. టీడీపీ నాయకులు తెలగంశెట్టి శ్రీని వాసులు, వల్లేపల్లి దుర్గారావు, ఇతర ఎన్డీ యూ కూటమి నాయకులు, మత్స్యకార సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

భూ సర్వే లోపాలు సరిచేసుకోండి

కోరుకొండ, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జగనన్న భూ సర్వేలో అనేక లోపాలు ఉన్నాయని ఎన్డీయే ప్రభుత్వం ఆ లోపాలను సరి చేసి రైతులకు సంబంధించిన పొలాల సమస్యలు పరిష్క రించడానికి ప్రతి గ్రామంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నాయని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుస్వాగతం పేర్కొన్నారు. కోరుకొండ మండ లం పశ్చిమగోనగూడెం, రాఘవాపురం గ్రా మాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వ ర్యంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిం చారు. పశ్చిమగోనగూడెం సర్పంచ్ రొంగల దేవిక, రొంగల శ్రీనివాస్, రాఘవాపురం సర్పంచ్ ముంద్రు సంధ్యారాణి, ముంద్రు గాంధీ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ డాక్టర్ అంబటి రజని, కె.ఆనంద్, వి.ధాన్య, కె.ఫణికు మార్,ప్రవీణ్, విశ్వనాధ్, మాజీ సర్పంచ్ కుచ్చు చల్లారావు, వీఆర్వో సూర్యకుమారి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

విశ్వజననీయమైన ఆలోచనలతో

పరిశోధనలు చేయాలి : వీసీ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నన్నయ వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ప రిశోధనలు నిరంతరం జరగాలని ఆదికవి నన్న య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదికవి నన్నయ వి శ్వవిద్యాలయం వాణిజ్యం, నిర్వహణ అధ్యయ నాలు విభాగం ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాల జీ అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వ హించారు. దీనికి వీసీ శ్రీనివాసరావు ముఖ్యఅతి థిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ పరిశోధనలు ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా విశ్వజనీనమైన ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. విశిష్టఅ తిథిగా విచ్చేసిన విశ్రాంత ఆచార్యులు పులపా సుబ్బారావు మాట్లాడుతూ ఇతిహాసాలైన రామా యణం, మహాభారతం, బైబిల్, ఖురాన్, బౌద్ధ గ్రంథాలపై అనేక పరిశోధనలు జరగాల్సి ఉంద న్నారు. పరిశోధనలు ఒకప్రాంతానికి పరిమితం అవుతున్నాయని, అపరిమిత దృష్టితో పరిశోధన లు చేయాలని సూచించారు. కార్యక్రమ డైరెక్టర్లు ఎన్.ఉదయభాస్కర్, పి.ఉమామహేశ్వరీదేవి మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌లవల్ల వి ద్యార్థులలో పరిశోధనపట్ల ఆశక్తి పెరుగుతుంద ని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రి న్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి. రీసోర్స్‌పర్సన్‌లు శ్రీరామరాజు, జె.రవిశంకర్, ఆచార్య కె.రమణేశ్వ రి, అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, పద్మవల్లి, ర మేష్, అమ్మిరెడ్డి, లలితారాణి పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను కాపాడుకుందాం

● పీడీఎస్‌యూ ర్యాలీ

రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలను కా పాడుకుందామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలో ప్రభుత్వ జూనియర్ క ళాశాల నుంచి కోటిపల్లి బస్టాండు వరకూ పీడీ ఎస్‌యూ వసంత మేఘగర్జన పేరుతో విద్యా ర్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కి రణ్‌కుమార్ మాట్లాడుతూ పీడీఎస్‌యూ 50 వ సంతాల నేపథ్యంలో ఈనెల 28న రాజమహేం ద్రవరంలోని ఆనం రోటరీ హాలులో జాతీయ మహాసభలు జరుగనున్నాయని, ముందస్తుగా



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ర్యాలీ నిర్వహించామని అన్నారు. రాష్ట్ర ఉపాధ్య క్షుడు కె.భాను ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యద ర్శి ఇల్లా చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి దినేష్ బాబు, విక్రమ్, రోహిత్, సోమలత, కుమారి, అ రుణోదయ రాష్ట్ర కార్యదర్శి భీమశంకర్, ఐఎఫ్‌టీ యూ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సీతానగరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబి రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు ప్రారం భించారు. ఆయన వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 640 మంది రోగులకు వైద్య సేవలు అందించగా సీతానగరం ఆరోగ్యకేంద్రం వైద్యులు ఎస్.రాజు ,డెల్టా హాస్పటల్‌కు చెందిన వైద్యులు చక్రవర్తి, ధన సాయిరెడ్డి,సుధ మేరి, ప్రశాంతి, నేత్రాలయం నుంచి వచ్చిన ఆప్టో మేట్రిస్ట్ రాజు శ్రీరమా దంతవేద్యశాల డాక్టర్ అమీర్‌లు రోగులకు వైద్య సేవలు అందిం చారు. వైద్య శిబిరం అనంతరం కళాశాల ప్రిన్సి పాల్ చిట్టిబాబును ఘనంగా సన్మానించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పల్లెపండుగ

● ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామా ల అభివృద్ధే ధ్యేయంగా పల్లెపండుగ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. శనివారం కడియం, వేమగిరి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. క డియంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. కడియం పడాలవారి వీధిలో రూ. 28 లక్షలతో సీసీ రోడ్డు, దళితవాడలో రూ. 5లక్షలతో డ్రైను కల్వర్టు, మేకల దిబ్బనుంచి చల్లా వీధి వరకు రూ. 45లక్షలతో సీసీ రోడ్డు, వేమగిరిలో రూ. 21 ల క్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ నాయకులు అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, ప్రత్తిపాటి రామారావుచౌదరి, డా. వెలుగు బంటి నాని, పాటంశెట్టి రాంజీ, గట్టి సుబ్బారావు, పంతం గణపతి, ముద్రగడ జమీ, పితాని శివరా మకృష్ణ, ఎంపీడీవో రమేష్ పాల్గొన్నారు.



కడియంలో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

● 14 బాక్సులలో మందు గుండు సామగ్రి స్వాధీనం

అనపర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఒక ఇంటిలో బాణా సంచా విక్రయాలు సాగిస్తున్న వ్యకిని శనివారంరాత్రి అరెస్టుచేసి అతని వద్ద నుంచి 14బాక్సులలో ఉంచిన మందుగుండు సామగ్రిని అనపర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం అనపర్తి గాంధీనగర్‌లోని ఒక ఇంట్లో అనుమతి లేకుండా బాణా సంచా విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామని అన్నారు. అనుమతి లేకుండా ఇంటిలో విక్రయాలు సాగిస్తున్న నల్లమిల్లి విజయ్‌కుమార్ రెడ్డిని అరెస్టు చేసి 14 బాక్సులలో నిల్వ ఉంచిన మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ రోగుల పాలిట సంజీవిని

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, అక్టోబరు26(ఆంధ్రజ్యో తి):అనేక వ్యాధులతో బాధపడుతున్న రోగు లకు సీఎం సహాయనిధి సంజీవిని లాంటి దని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొ న్నారు. శనివారం కోరుకొండ మండలంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. మునగాల గ్రామానికి చెంది న మాదరపు సుబ్బారావుకు రూ.1.60లక్షలు, నిడిగట్ల గ్రామానికి చెందిన కందికట్ల భా స్కరరాజుకు రూ.72,258లు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జన సేన జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకట లక్ష్మి, మేడిశెట్టి శివరాం, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ఎయిడెడ్ పాఠశాలల వ్యవస్థను కాపాడుకుందాం'

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26: విద్యావ్యవస్థలో ఎంతో ఘనచరిత్ర కలిగిన ఎయిడెడ్‌ను సమిష్టి కృషితో కాపాడుకుందా మని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్య క్షుడు చిట్టిబాబు అన్నారు. స్థానిక జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా కమిటీ ఐక్యతా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావ్యవస్థలో వచ్చిన పెను మార్పులు కారణంగా అన్ని పాఠశాలతో పాటు ఎయిడెడ్ పాఠశాల పైన ప్రభావం పడిందని తత్ఫలితంగా ఎయి డెడ్ పాఠశా లలో విద్యార్థుల రోలు తగ్గిందన్నారు. ఉపాధ్యాయులంతా మరింత కృషి చేసి ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం ప్రస్తు త ఉపా ధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న స మస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు టీ మార్టిన్ సుధాకర్, లూథరన్ స్కూల్ కరస్పాండెంట్ ఎం. బజయ, ఏపీటీజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌హెచ్ అమూల్యాబాల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవిన సిస్టర్స్‌ని అభినందించి ఎస్ఐ

రంగంపేట, అక్టోబరు 26: పోలీసు అమరవీ రుల వారోత్సవాల సందర్భంగా గురువారం రంగంపేటలో ప్రముఖ సైకతశిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు తమ ఇంటి వద్ద దేవిన సోహిత,ధన్యతలు 'మరువలేనిది మీ త్యాగం' అనే నినాదంతో సైకత శిల్పం రూపొందించిన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ వారిద్దరినీ అ భినందించి వారి కుటుంబ సభ్యులకు పోలీసు వారి అందరి తరపున కృతజ్ఞతలు తెలుపుతూ ఎస్ఐ తోట కృష్ణసాయి తమ సిబ్బందితో కలిసి శనివారం చిరుజ్ఞాపికను అందించారు.



దేవిన సిస్టర్స్‌ని అభినందిస్తున్న రంగంపేట ఎస్ఐ కృష్ణసాయి

ఆలిండియా లెవెల్‌లో ఆదిత్య విద్యార్థికి ఏడో ర్యాంకు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 26: నౌకరీ యంగ్ టర్క్స్ సంస్థ రెండవ రౌండ్ విభాగంలో ఆల్ ఇండియా లెవెల్‌లో నిర్వ హించిన టెస్ట్‌లో స్థానిక ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థిని కొండిపూడి కావ్య కైవ శం చేసుకుంది. అదేవిభాగంలో 45, 91, 136, 547, 939 ర్యాంకులను విద్యార్థులు సాధిం చారు. కళాశాల సెక్రటరీ సుగుణ, డైరెక్టర్ నా యుడు, ప్రిన్సిపాల్ రెహమాన్ విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు.

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్క ర్స్ యూనియన్ తూర్పుగోదావరిజిల్లా కమిటీని జిల్లా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలో జరి గిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా తాటిపాక మధు, అధ్యక్షుడిగా సంగిశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శిగా అల్లం వెంకటేశ్వరరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ముత్యాల మురళీకృష్ణ, ఆర్గ నైజింగ్ సెక్రటరీగా కాకి అప్పలరాజు, ఉపాధ్య క్షుడిగా దానాల దుర్గమ్మ, బంగారు నాగేశ్వరరా వు, బంగారు వీర వెంకటగిరిబాబు, కోశాధికారి గా గుడుపు వెంకటగిరి, సహాయ కార్యదర్శులు గా కాకి శారద, అల్లం బాలు, నెడుమిల్లి శ్రీను తోపాటు మరో 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి పుట్టినరోజు వేడుక

రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎల్లవేళలా అందుబా టులో ఉంటానని.. సమస్యల పరిష్కారానికి పా టు పడతానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. తన పుట్టిన రోజును ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శనివారం సాదాసీదాగా చేసుకున్నారు. మెగా జాబ్ మేళాలోనే అభిమానులు, టీడీపీ నాయకు ల మధ్య కేక్‌కట్ చేశారు. పుట్టిన రోజున 1500 మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంద న్నారు.13,14 డివిజన్లకు చెందిన తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జులు కప్పల వెలుగుకుమారి,ఈతల పాటి రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు చెల్లు బోయిన సూర్యనారాయణమూర్తి,ఆల్ షమీ గ్రూ ప్ చైర్మన్ అబ్దుల్లా సహకారంతో పేద మహిళ లకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడు పూడి సత్తిబాబు, టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, అధికార ప్రతిని ధి దాస్యంప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర ప్రధా న కార్యదర్శ నక్కా దేవి వరప్రసాద్, చాపల చిన్నరాజు, ఉప్పులూరి జానకిరామయ్య , మరు కుర్తి రవియాదవ్, కొయ్యల రమణ, కోరుమిల్లి విజయశేఖర్, మొకమాటి సత్యనారాయణ, శెట్టి జగదీష్, తెలుగు మహిళా నాయకులు కోసూరి చండీప్రియ, మాలే విజయలక్ష్మి, మీసాల నాగ మణి, మోతా నాగలక్ష్మి, బంగారు నాగేశ్వరరావు, రాయి అప్పన్న,బొర్రా చిన్ని పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రంగంపేట విద్యార్థులు ఎంపిక

రంగంపేట, అక్టోబరు 26: ఈ నెల 24, 25 తేదీలలో గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ రాజమహేం ద్రవరంలో జరిగిన స్కూల్స్ గేమ్స్‌లో రంగంపేట మండలంలోగల రంగంపేట, దొడ్డిగుంట హై స్కూల్స్ విద్యార్థులు ప్రతిభను చాటారు. స్కూల్స్ గేమ్స్‌లోభాగంగా రంగంపేట హైస్కూల్ విద్యా ర్థులు అండర్ 17 బాలికల విభాగంలో షాట్ పుట్‌లో పి.హర్షిత ద్వితీయ స్థానం, పోల్‌వోల్ట్‌లో కె.లక్ష్మీశ్రావ్య ప్రథమస్థానం, బాలుర విభాగంలో డి.మేఘశ్యామ్ ప్రథమస్థానం, 100 మీటర్ల రిలేలో కె.యవ్వనలక్ష్మీ, అండర్ 14లో 400 మీటర్లలో గుత్తుల ఉషశ్రీ విజయాన్ని సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం వి.పార్థసారధి తెలిపారు. దొడ్డిగుంట హైస్కూల్ విద్యార్థులు డిస్కస్‌త్రోలో అండర్ 17 విభాగంలో పాతదొడ్డిగుంట హైస్కూల్‌కు చెంది న 10వ తరగతి విద్యార్థిని కె.కీర్తన రెండవ స్థానాన్ని పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైం ది. 8వ తరగతికి చెందిన విద్యార్థిని కె.శ్రీవల్లి అండర్ 14 విభాగంలో లాంగ్‌జంప్‌లో రెండవ స్థానాన్ని పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం కె.రాధారాణి తెలిపారు.

అథ్లెటిక్ పోటీల్లో

రాష్ట్రస్థాయికి భూపతిపాలెం విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గోకవరం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): రాజమ హేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల్లో శనివారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో గోకవ రం మండలం భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థా యికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.రవి తెలిపారు. ఎస్.జి.ఎఫ్ గేమ్స్‌లో అథ్లెటిక్స్ అండర్-14, అండ ర్-17 జిల్లాస్థాయి పోటీలలో తమ పాఠ శాల విద్యార్థులు హవా కొనసాగించారన్నారు. అండర్ -14 విభాగంలో బి.రిషికేష్, ఎ.ధనుష్, ఓ.మనోజ్ కుమార్ ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. అండర్-17 విభాగంలో ఎ.లవరాజు, ఎల్.రామ్‌నా యుడు, అజయ్‌కుమార్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలుసాధించి రాష్ట్రస్థాయి ఎంపికయ్యారు.

పుల్లా చంటియ్యకు ఘన నివాళి

కడియం, అక్టోబరు 26: ఇటీవల కడియపులంకకు చెందిన సత్యదేవా న ర్సరీ అధినేత, నర్సరీసంఘం మాజీ అధ్యక్షులు పుల్లా చంటియ్య మృతి చెందారు. చంటియ్యకు శనివారం సంస్మరణ సభ జరిగింది. ప్రజాప్రతిని ధులు, నర్సరీసంఘం ప్రముఖులు, నర్సరీ రైతులు చంటియ్య చిత్ర పటం వద్ద ఘన నివాళులు అర్పించారు.



పుల్లా చంటియ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు



అతి వినియోగం ప్రమాదమే..



ప్రతి వస్తువులోను మంచిచెడులు ఉంటాయి. కేవలం మంచిని గ్రహించాలి. కత్తితో వైద్యుడు శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు నిలబెడతాడు. అదే కత్తితో చెడ్డవాడు ప్రాణాలు తీస్తాడు. ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చిందే ఇంటర్నెట్. దానిని స్మార్ట్‌ఫోన్‌లో పరిమితంగా వినియోగిస్తే జ్ఞానమే. ఎడిక్ట్ అయితే ప్రమాదమే. పిల్లలు దేనికి అలవాటుపడితే దానికి బానిసలవుతారు. ఆ పరిస్థితి రాకుండానే తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, మానసిక వైద్యనిపుణులు, రాజమండ్రి

రబీ వరి వంగడాలివే

కరపత్రం ఆవిష్కరించిన కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రబీకి అనుకూలమైన వరి వంగడాలను రైతులు ఎంపిక చేసుకోవాలని.. దీనికి సంబంధించిన వ్యవసాయ శాఖ ఓ కరపత్రం సిద్ధం చేసిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావుతో కలిసి రబీ వరి వంగడాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎంటీయూ 1121 (శ్రీధృతి), ఎంటీయూ 1156 (తరంగిణి), ఎంటీయూ 1153 (చంద్ర), ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మషూరి), ఎంటీయూ 1010 (కాటన్‌దొర సన్నాలు), ఎంటీయూ 3626 (ప్రభాత్), ఎన్‌డీఎల్ఆర్ 8 (నంద్యాల సన్నాలు), ఎంటీయూ 1210(సుజాత),ఎన్ఎల్ఆర్ 3354 (నెల్లూరు ధాన్యరాశి),ఎంటీయూ రైస్ 1293, ఎన్ ఎల్ఆర్ రైస్ 3238, ఎంటీయూ రైస్ 1273 రకాలు ఎంపిక చేసుకోవాలన్నారు.



విద్యార్థులకు ఓపెన్‌హౌస్

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విధినిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడేవాడు పోలీస్ అని..అటువంటి పోలీసులను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ స్మారకోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థులకు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు.విద్యార్థులకు సైబర్ అవేర్‌నెస్ ప్లకార్డులను వినూత్నంగా ప్రదర్శించారు.పోలీసుశాఖ ఆయుధాలు , టెక్నాలజీపై అవగాహన కల్పించారు. 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

8 టిప్పర్ లారీలు అడ్డగింత

దివాన్‌చెరువు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం భూపాలపట్నంలో వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గ్రామస్తులతో కలిసి శుక్రవారం అర్ధరాత్రి 8 టిప్పర్ లారీలను అడ్డుకున్నారు. లారీలలో పాతతుంగపాడు నుంచి దుళ్లకు అక్రమగ్రావెల్ తరలిస్తున్నారన్నారు.సహజవనరుల దోపిడీ, మాదకద్రవ్యాలకు రాజానగరం నిలయంగా మారిందన్నారు.రాజానగరం తహశీల్దార్‌కు ఫోన్ చేసినా స్పందనలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆమె వెంట పంతం దుర్గారావు,తోరాటి సోమరాజు, తోరాటి గోవిందు, మరుకుర్తి వెంకటేశ్వరరావు ఉన్నారు

పాప ఏడుస్తోంది.. ఉడ్‌వర్డ్స్ పట్టవే.. ఇదీ చాలా సుపరిచితమైన యాడ్.. ఇది ఒకప్పటి మాట.. మరిప్పుడు పాప ఏడుస్తోంది అంటే సెల్‌ఫోన్ ఇవ్వు ఊరుకుంటుందే అనే రోజులు వచ్చేశాయి.. పిల్లలు ఏడాది నుంచే సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయిపోతున్నారు.. అదే మంచిదనుకుని.. చిన్నారులకు సెల్‌ఫోన్ ఇచ్చేసి తమ పని తాము చేసుకుంటున్నారు.. సెల్ ఎందుకిచ్చావే అంటే ఫోన్ ఇస్తేనే కానీ ఊరుకోవడంలేదనేది పెద్దల మాట.

ఒక పిల్లాడు తీక్షణగా సెల్‌ఫోన్ చూస్తున్నాడు.. సెల్ ఫోన్ పక్కన పెట్టేసి చదువుకోమని తల్లి చెబుతూనే ఉంది.. అయినా వినకపోవడంతో సెల్‌ఫోన్ లాక్కుని పుస్తకం చేతిలో పెట్టి చదువుకోమని చెబుతోంది. అనంతరం ఆమె టీవీ పెట్టుకుని చూస్తూ ఉంటుంది.. అప్పటికే సెల్‌ఫోన్ లాక్కుందని కోపంతో ఉన్న కుమారుడు.. పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్ తీసుకుని తల్లి తలపై మోదుతాడు.. ఇదీ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.. సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయితే ఎంత ప్రమాదమో చాటి చెప్పింది..

ఒక పెద్దావిడ సెల్‌ఫోన్ చూస్తూ ఇంట్లో వంట చేస్తోంది.. ఫోన్‌లో పడి వంట సంగతి మర్చిపోయింది.. కాసేపటికి కిచెన్ నుంచి పొగలు వస్తున్నాయి.. అయినా ఆమెకు వాసన తగల్లేదు.. ఇంతలో అదృష్టం కొద్దీ ఆమె భర్త ఇంటికి వచ్చాడు.. ఇంట్లో నుంచి వచ్చే పొగను చూసి కంగుతిన్నాడు.. వెంటనే ఏమేవ్ ఏం చేస్తున్నావ్.. ఇల్లు తగలబడిపోతుందే అంటూ పెద్దగా కేకలు వేశాడు.. తేరుకున్న ఆమె కిచెన్‌లోకి వెళ్లి చూసేసరికి వండిన కూర కాస్తా మాడిమసైపోయింది.. కాసేపు ఆగితే మంటలు చెలరేగి పెద్ద ప్రమాదమే జరిగేది.

ఆసుపత్రిలో ఉన్నా.. తల్లిదండ్రులతో షాపింగ్‌లో ఉన్నా.. బైక్‌పై వెళుతున్నా.. కారులో వెళుతున్నా.. ఇంట్లో ఉన్నా.. ప్రస్తుతం చిన్నారుల చేతిలో కనిపించేది ఒక్కటే.. అదే సెల్‌ఫోన్.. బడిలో తప్పించి ప్రతి చోటా చిన్నారుల ప్రపంచం సెల్ బందీగా మారిపోయింది.. అది లేనిదే అన్న ముట్టరు.. అది చూడనిదే స్నాక్స్ తినరు.. అందుకే నేటితరం చిన్నారుల్లో నూటికి 60 శాతం చిన్నారులు నాలుగు కళ్లతో దర్శనమిస్తున్నారు..



సెల్‌కలం!

(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం సిటీ)

చందమామారావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే.. గోగిపూలుతేవే.. అంటూ చందమామను చూపిస్తూ తల్లులు వారి చంటిబిడ్డలకు గోరుముద్దలు తినిపించే రోజులు పోయాయి. ప్రస్తుత ఆధునికయుగంలో యాపిల్ రావే.. ఐఫోనురావే.. మా పిల్లవాడితో ఆడుకోవే.. గేమ్‌లతో రావే.. మా చంటిబిడ్డను అలరించవే అంటూ ప్రసుత్త యుగం తల్లిదండ్రులు చేస్తున్న చిన్నపాటి పొరపాటు భవిష్యత్తులో అది తీవ్రరూపం దాల్చి బాల్యం మంతా సెల్‌కు బానిసలుగా మార్చేసింది. తిండి లేకపోయినా ఉంటున్నారు కానీ పది నిమిషాలు సెల్ ఆగిపోతే ప్రాణం పోయినట్టు నేటి సమాజం తయారైంది. నేటి తరంలో ఏడాది చంటిబిడ్డ మొదలుకుని వృద్ధుల వరకు సెల్ బారిన పడనివారులేరంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ఉండడంకోసం, ప్రపంచ జ్ఞానం కోసం రూపొందించిన అంతర్జాల చరవాణి ఇప్పుడు కొత్తపుంతలు తొక్కి మనిషి ఆరోగ్యానికి హానికరంగా మారిపోయింది. ఇందులో మంచిని గ్రహించి పరిమిత వినియోగం చేసేవారికంటే చెడును గ్రహించే వారే ఎక్కువయ్యారు. ముఖ్యంగా పిల్లలపై పెనుప్రభావానే చూపిస్తుంది.

తెల్లారింది మొదలు..

మనిషి ఉదయం లేచిన నాటి నుంచి రాత్రి నిద్రించే వరకు ఉన్న సమయంలో సెల్ ఫోనుదే ప్రథమస్థానం. మంచం పైనుంచి లేవగానే ఫోన్.. కాలకృత్యాలు తీర్చుకుంటూ ఫోన్.. బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ ఫోన్.. ఇలా చెప్పుకుంటూపోతే ఫోన్‌తోనే రోజంతా ఉంటారు.. ఆఖరికి రాత్రి పడుకునే ముందు అర్ధరాత్రి వరకు ఫోన్‌లోనే ఉంటున్నారు. అది చాలదన్నట్టు ఇంట్లో గృహిణిలకు అంటించారు. ఇప్పుడు వాళ్లు కూడా అనుక్షణం ఫోన్‌లతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఇక పిల్లల విషయానికి వస్తే అన్నం తినను అన్నా.. మారం చేసినా ఫోన్ ఇచ్చి వారిని సముదాయిస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోతే గోలగోల చేసేవిధంగా కుటుంబమంతా ఎడిక్ట్ అయ్యింది.

అరచేతిలో ఫోన్..కంట్లో నలుసు

- టచ్ చేస్తే బోలెడు వినోదం
- ఎడిక్ట్ అవుతున్న పిల్లలు..పెద్దలు
- సెల్‌ని వదల్లేకపోతున్న వైనం
- దంపతుల మధ్య దూరం
- అటకెక్కుతున్న చదువులు
- ఫోన్లకు బాల్యం బందీ
- మందగిస్తున్న కంటిచూపు
- పక్కదారి పడుతున్న విజ్ఞానం



చదువులపై పెనుప్రభావం

పిల్లలు అడిగారని తల్లిదండ్రులు ఆలోచించకుండా ఆండ్రాయిడ్ ఫోన్లను ఇస్తున్నారు. ఇదే ఇప్పుడు వీరి చదువుపై ప్రభావం చూపిస్తోంది. చదువుకునే సమయంలో ఫోన్ దగ్గర పెట్టుకుని చాటింగ్‌లు చేయడం, యూట్యూబులు చూడడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలు వెతుకులాట చేస్తూ చదువుపై ఏకాగ్రత సన్నగిల్లుతోంది. ఫలితంగా పిల్లలు చదువులో వెనుకబడుతున్నారు. నిజానికి కొన్ని స్కూల్స్, కళాశాలలో సెల్‌ఫోన్లను అనుమతించరు. ఎందుకంటే సెల్‌ఫోన్‌తో ఉంటే చదువు పాడైపోతుందని వారికి తెలుసు. కొన్ని కళాశాలల్లో మాత్రం ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ తప్పనిసరి అంటున్నారు. అవసరం మేరకు వాడితే సెల్‌ఫోన్ విజ్ఞానాన్ని పంచుతుంది. పరిమితిమించి వాడితే వినాశానానికి దారితీస్తుంది. కాబట్టి సెల్‌ఫోన్ ఇవ్వడం తప్పుకాదుకానీ..అది అతిగా వినియోగిస్తేనే తప్పు. తల్లిదండ్రులు మాత్రం అప్రమత్తంగా ఉండాలి.

దంపతుల మధ్య దూరం..

ఒకనాడు కుటుంబ బాంధవ్యాలు ఉండేవి.. పెద్దలు వస్తే చాలా గౌరవంగా చూసేవారు. మరిప్పుడో పెద్దలు వచ్చినా ఎవరి పని వారిదే.. సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలం గడిపేస్తున్నారు.. వచ్చిన వాళ్లు వెళ్లిపోతుంటే ఊ అనే చిన్న సమాధానం తప్ప.. క్షేమసమాచారం మాటే మరిచారు. కుటుంబంలో నలుగురు ఉంటే నలుగురు తలో సెల్‌ఫోన్ పట్టుకుని నాలుగు గోడల మధ్య జీవిస్తున్నారంటే పరిస్థితి ఎంతగా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. రాజమహేంద్రవరంలో ఇటీవల భార్యభర్తలు పార్కుకు వచ్చారు..ఒక మంచి ప్లేస్ చూసుకుని కూర్చున్నారు.. ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటారులే అని చూస్తుంటే అతను ఒక ఫోన్.. ఆమె ఒక ఫోన్ పట్టుకున్నారు.. వచ్చినప్పటి నుంచి వెళ్లే వరకూ కీపాడ్‌పై పైకీ కిందకూ లాగుతూనే ఉన్నారు. చివరికి భార్య లేచి వెళ్లిపోదాం అనే సిగ్నల్ ఇవ్వడంతో భర్త ఫోన్ జేబులో పెట్టుకుని బయలుదేరాడు. అంతలా దంపతుల మధ్య సెల్ దూరిపోయింది. దూరం చేస్తుంది. అంతేకాదండోయ్ సోషల్ మీడియా వాట్సాప్.. ఫేస్‌బుక్.. ఇన్‌స్టా తదితర యాప్‌లతో అనుమానపు చిచ్చురేగుతోంది. కుటుంబాలు విడిపోతున్నాయి. సెల్‌కి ఎడిక్ట్ అయిన భార్యభర్తను పట్టించుకోవడంలేదంటే అతిశయోక్తి కాదేమో.

దెబ్బతింటున్న ఆరోగ్యం

ఆండ్రాయిడ్ ఫోన్‌లకు ఎడిక్ట్ అయినవారు ప్రస్తుతం అనారోగ్య సమస్యలు బారిన పడుతున్నారు. ముఖ్యంగా చంటి బిడ్డకు చూపు మందగిస్తుంది. ఇంట్లో అదే పనిగా సెల్ చూస్తూ ఉండడం వల్ల కంట్లో రెటీనాపై ప్రభావం పడుతుంది. అందుకే పదేళ్ల దాటేసరికే చాలామందికి చూపు మందగిస్తోంది. స్కూల్‌కి వెళితే బ్లాక్ బోర్డు, డిజిటల్ బోర్డుపై అక్షరాలు కనిపించలేని పరిస్థితి. దీనికి ప్రధాన కారణంగా ఫోన్ నిలుస్తోంది. చీకటి గదిలో ఫోన్ చూడడం, ముఖానికి దగ్గరగా ఫోన్ పెట్టుకుని చూడడం వల్ల కంటి సమస్యలు వస్తున్నాయి. 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలు సెల్‌ఫోన్‌లో గేమ్‌లు ఆడుతున్నా తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోకపోవడంతో వారి మానసికస్థితిపై పడుతుంది. ఫ్రీఫైర్, హంటింగ్ తదితర గేమ్‌లు ఆడుతున్న బాలలు ఆ గేమ్‌లో ఉన్న వారిని అనుకరిస్తూ తమలో తామే మాట్లాడుకోవడం, ఆ గేమ్‌లో ఎటాక్‌లు జరిగినప్పుడు ఎదుర్కొనే దృశ్యాలు నిజజీవితంలో జరుగుతున్నట్టు ఫీలై ప్రవర్తించడం వంటివి చేస్తున్నారు. కొంతమంది పబ్‌జీకి ఎడిక్ట్ అయి ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. సరదాగా ప్రారంభమైన సెల్‌గేమ్ బాల్యాన్ని ఆపదలోకి నెట్టివేస్తుంది. ఆండ్రాయిడ్ ఫోను నిద్రించే సమయంలో దిండు వద్ద పెట్టుకోవడం, పక్కన పెట్టుకోవడం వల్ల రేడియేషన్ కారణంగా మనిషి శరీరంలో ఇమ్యూనిటీ తగ్గించడంతోపాటు క్యాన్సర్ కణాలు పెరిగే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే సాధ్యమైనంత వరకు ఆం డ్రాయిడ్ ఫోన్లను దూరంగా ఉంచడమే ఉత్తమం.

వైసీపీలో ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్వీర్యం

- ఇసుక కొరత లేకుండా చూడండి
- వారంలో ఓపెన్ ర్యాంపులు
- రూ.145కే టన్ను ఇసుక
- తూర్పు సమీక్షలో మంత్రి నిమ్మల



జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల సమీక్షలో మాట్లాడుతున్న గన్ని కృష్ణ చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, బత్తుల తదితరులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థ 20 ఏళ్ల వెనక్కిపోయిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆందోళన వ్యక్తం చేశారు.స్థానిక కలెక్టరేట్‌లో శని వారం జరిగిన తొలి జిల్లా రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.గత ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయ న్నారు.సం క్షేమం పేరుతో జగన్ రాష్ట్రాన్ని దోచుకున్నాడన్నాడు. సీఎం చంద్రనాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలు తీర్చే మంచి ప్రభుత్వం వచ్చిందని, కేంద్రంలో ప్రధాని మోదీ సహకారం అందిస్తున్నారన్నారు. జగన్ ఇసుకను దోపిడీకి వినియోగిస్తే..చంద్రబాబు ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఇసుక కొరత లేకుండా బోట్స్‌మన్ సొసైటీలను పెంచుతున్నామన్నారు. వారం రోజుల్లో ఓపెన్ రీచ్‌లు ప్రారంభమవుతాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం డీసిల్టేషన్ ర్యాంపుల వల్ల టన్ను రూ.625కు అమ్మితే తాము రూ.228కే అందిస్తున్నామన్నారు.అందులో రూ.198 బోట్స్‌మన్ సొసైటీలకే అందు తుందని.. ఓపెన్ రీచ్‌ల వల్ల గత ప్రభుత్వం రూ.475లకు అమ్మితే తాము రూ.145కే టన్ను అందిస్తున్నామన్నారు. ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు సొంత అవసరాలకు ఇసు కను వాడుకుంటే ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. కానీ విక్రయిస్తే ఉపేక్షించేలేదని..కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.ఆర్అండ్‌బీ రహదారుల్లో గుంతలను ముందుగా పూడ్చనున్నామని..తర్వాత రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ.4500 కోట్లతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి చేపట్టిన పల్లె పండుగలో గుర్తించిన పనులను సంక్రాంతికే పూర్తిచేయనున్నామన్నారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేసిందన్నారు.రాష్ట్రంలో 1080 ఎత్తిపోతల పథకాలు ఉంటే 450 మూతపడ్డా యని చెప్పారు. దీని వల్ల 3 లక్షల ఎకరాల ఆయకట్టు బీడుగా మారిపోయిందన్నారు. వాటికి పునర్జీవం ఇవ్వడంపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టారన్నారు. పోలవరం ప్రాజెక్టు డయా ఫ్రంవాల్ వైసీపీ వైఖరి వల్ల పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. నవంబరు రెండో వారంలో సీఎం చంద్రబాబు పోలవరం వచ్చి పనులు ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్వహణకు ఏడాదికి రూ.980 కోట్లు అవసరం కాగా, వైసీపీ కంటితుడుపుగా కేవలం రూ.270 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు.మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా ముందుకెళతామని తెలిపారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేకుండా చూడడం కోసం చర్యలు తీసుకున్నామని..కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు ఎన్నికలు జరిపించాలని, గ్రామాల విలీనం వంటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసి సిబ్బందిని క్రమబద్ధీకరించాలని సూచించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ, కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ టెండర్ల ప్రక్రియను చేపట్టాలన్నారు.అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చాగల్నాడు, వెంకటనగర్, పుష్కర లిఫ్ట్ పథకాలను పునరుద్ధరించి సాగునీటిని అందించాలని కోరారు.గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కారణంగా కొవ్వాడ,ఎర్రకాలువ గట్లు బలహీనపడ్డాయని,ఈ ప్రాంతంలో సుమారు 6 వేల ఎకరాల వరకూ ముంపునకు గురైందన్నారు.కాలువల ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపించి..పనులు చేపట్టాలని కోరారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రిక పరికరాలు,డ్రిప్, ట్రాక్టర్లు సబ్సిడీపై రైతులకు అందజేయాలన్నారు.సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్, డీఆర్‌వో జి.నరసింహులు, కమిషనర్ కేతన్‌గార్గ్, ఆర్డీవో కృష్ణనాయక్, సీపీవో అప్పలకొండ పాల్గొన్నారు.



కొత్తతుంగపాడులో అక్రమ తవ్వకాలు

దివాన్‌చెరువు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): అక్రమమైనింగ్ వెంటనే నిలిపివేసి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కొత్తతుంగపాడులోని క్వారీల వద్ద డీసీసీ మాజీ అధ్యక్షుడు యాళ్ల మాసరయ్య ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన చేశారు. కొత్తతుంగపాడు రెవెన్యూ పరిధి స.నెం974/1లోని 88 సెంట్లు భూమి, జి.ఎర్రంపాలెంలోని స.నెం 330/4 లోగల దాదాపు 4 ఎకరాల భూమిలో అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు.దీనిపై గనులశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోడి నాగేశ్వరరావు, ఎడ్ల సత్యనారాయణ, ఆలపాటి గోవిందు, గోవిందరాజు, అబ్బులు పాల్గొన్నారు.

యువత ఉపాధికి స్కిల్ శిక్షణ

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు జాబ్‌మేళా
- 1500 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చిత్రంలో బీవీఆర్ చౌదరి, ప్రిన్సిపాల్ రామచంద్ర టీడీపీ నాయకులు

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి కల్పించాలన్నదే ప్రధాన లక్ష్యమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగర ప్రజలకు ఇచ్చిన డిక్లరేషన్‌లో ప్రధానమైన ఉద్యోగ,ఉపాధి స్కీమ్‌లో భాగంగా తన సొంత ఖర్చులతో 80 కంపెనీలను రప్పించి ఆర్ట్స్‌కళాశాలలో శనివారం జాబ్ మేళా ఏర్పాటు చేశారు. వేలాదిగా నిరుద్యోగులు తరలివచ్చారు.తొలుత జాబ్‌మేళా ప్రారంభిం చారు. ఇంటర్వ్యూలు నిర్వహించగా 1500 మందికి ఉద్యోగాలు వచ్చాయి.. ఆఫర్ లెటర్స్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అందించి మాట్లాడారు.యువత గత ఐదేళ్లుగా ఎటువంటి ఉద్యోగావకాశాలు లేక తీవ్ర ఇబ్బం దులు పడ్డారని చెప్పారు. తన పుట్టిన రోజున ఒక మంచి కార్యక్రమాన్ని తలంచి తన సొంత ఖర్చులతో 80 కంపెనీలతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.అమరావతి సొల్యూషన్స్, భవాని చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ప్రతి మూడు నెలలకు వంద మంది నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్‌లో స్కిల్స్ శిక్షణ ఇస్తామన్నారు. ఒక్కో అభ్యర్థికి రూ.20 వేలు ఖర్చవుతుందని అందులో రూ.15 వేలు ఫీజు భవానీ చారిటబుల్ ట్రస్టు భరిస్తుందని అభ్యర్థి రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలు వస్తాయన్నా రు. కార్యక్రమంలో ఆర్‌డీవో కృష్ణనాయక్, ఆర్ట్స్‌కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులచే మాక్ పోలింగ్

ఉండ్రాజవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడ హైస్కూలులో 6వ తరగతి విద్యార్థులకు శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రతినెలా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి స్కూలు ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)సత్యవాడ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడు పీఎస్‌వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈక్లబ్‌అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునేందుకు 6వ తరగతి విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు.

పాఠశాలకు బీరువా అందజేత

దేవరపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గొల్లగూడెంలోగల ప్రభుత్వ పాఠశాలకు స్థానికంగా ఉన్న రగడపాటి రామలక్ష్మమ్మ, రామానాయుడు దివ్యాంగుల వృద్ధుల ఆశ్రమ చైర్మన్ కాగిత భాస్కరరావు తండ్రి డేవిడ్ పేరు మీద రూ.12వేలు విలువ గల ఐరన్ బీరువాను స్కూల్‌కి అందజేశారు. ఈ విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేశారు.విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణం

పూచీకత్తు లేకుండా రూ.1.5 లక్షలు అందజేత

- పాడి రైతులకు ప్రోత్సాహం
- పశుకిసాన్ క్రెడిట్ పథకం అమలు
- రైతులకు కిసాన్ కార్డుల జారీ
- మూడేళ్ల కాలపరిమితి
- తక్కువ వడ్డీకే రుణం
- చెల్లింపులను బట్టి రాయితీ



రూ.1.5 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో రుణ సహాయం పొందాలనుకుంటే భూమికి సంబంధించిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

రాజానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు పశు కిసాన్ క్రెడిట్ (పీకేసీసీ) పథకాన్ని అమల్లోకి తెచ్చి కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి చర్యలు చేపడుతోంది.ఈ మేరకు తక్కువ వడ్డీకి అధిక మొత్తంలో బ్యాంకు రుణాలు పొందేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడిన రైతులు, కౌలు రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ క్రెడిట్ కార్డు తీసుకోవచ్చు. కాలపరిమితి మూడేళ్ల తర్వాత పునరుద్ధరించుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవడమెలా..

గ్రామ పశుసంవర్ధక సహాయకులు, పశు వైద్య సిబ్బంది దరఖాస్తులు పూర్తి చేసి సమీపంలోని ప్రభుత్వ బ్యాంకుల్లో అందజేయడం ద్వారా అర్హత కలిగిన పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు, పాస్ పుస్తకం ఇస్తారు. కేవైసీ కోసం భూమి దస్త్రాలు, పశువులకు సంబంధించిన ఆరోగ్య ధ్రువపత్రం, పాస్ పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డుల నకళ్ల జత చేయాలి.

ఇవీ ఉపయోగాలు..

కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా గరిష్ఠంగా ఇచ్చే రుణం రూ.3 లక్షలు. పూచీకత్తు లేకుండా మంజూరు చేసే మొత్తం రూ.1.5 లక్షలు. 40 రోజుల్లోపు తిరిగి చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుంది. గడువు దాటాక చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోగా క్రమం తప్పకుండా తిరిగి చెల్లిస్తే ఆర్‌బీఐ, నాబార్డు 3 శాతం, బ్యాంకు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ)3 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తారు.రైతు ఒక శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలి.

బహుళ ప్రయోజనాలు

క్రెడిట్ కార్డులతో పాడి రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. కార్డును సక్రమంగా వినియోగిస్తే ఎలాంటి వడ్డీ భారం లేకుండానే ఆర్థిక అవసరాలు తీరుకోవచ్చు. ప్రతి మండలంలో పాడి రైతులకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. రాజానగరం మండలంలో 1200 దరఖాస్తులు లక్ష్యం కాగా 646 దరఖాస్తులు బ్యాంకు అధికారులకు సమర్పించాం.

- డాక్టర్ ఎం.సత్యనారాయణ మూర్తి, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు





ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు, దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమే ముఖ్యమా!

దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎంపీ హర్షకుమార్

గుమ్మళ్లదొడ్డిలో 5వ రోజుకు నిరవధిక దీక్ష

గోకవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమ నిర్వహణే ప్రభుత్వానికి ముఖ్యమా అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రశ్నించారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తరలించాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లాగోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి చేపట్టిన నిరవధిక దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకొంది. దీక్ష శిబిరాన్ని హర్షకుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు తాను అండగా నిలుస్తానన్నారు. కాలుష్య పరిశ్రమల నిర్వహణ కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వేధిస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం బాధితుల పట్ల సానుకూలంగా వ్యవహరించి కంపెనీని ఇక్కడి నుంచి తరలి వెళ్లిపోయేలా చర్యలు తీసు కోవాలన్నారు. కాలుష్యకారకమైన పరిశ్రమను తమ గ్రామం నుంచి తరలించాలని కోరుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చేరే విధంగా స్థానికులు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. పరిశ్రమ వల్ల ఎదుర్కొం టున్న ఇబ్బందులను పోస్టుకార్డులో పొందు పరుస్తున్నారు. అనారోగ్యానికి గురిచేసే ఈ పరిశ్రమ మాకొద్దంటూ అధిక సంఖ్యలో బాధితులు రాజమహేంద్రవరం-భద్రాచలం రహదారిపై బైఠాయించారు. అటు రెండు కిలో మీటర్లు, ఇటు రెండు కిలోమీటర్లు మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పరిశ్రమ గేటు ఎదుట ఆందోళన చేసేందుకు బయల్దేరిన ఆందోళన కారులను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన విరమించాలని అదనపు ఎస్పీ సుబ్బరాజు మరోమారు చేసిన ప్రయత్నం ఫలించలేదు. పరిశ్రమను గుమ్మళ్లదొడ్డి నుంచి తరలిస్తామని తమకు సరైన హామీ లభించే వరకు ఆందోళన విరమించేది లేదని ఆందోళనకారులు తేల్చి చెప్పారు.

పోలీసులకు.. గ్రామస్తులకు మధ్య తోపులాట

సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

కాగా ఇథనాల్ పరిశ్రమ ప్రధాన గేటు ముందు శనివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.. పరిశ్రమ నిర్వహణను తక్షణమే నిలిపివేయాలంటూ స్థానికులు గేటు ఎదుట ఆందోళనకు దిగారు. పరిశ్రమ నుంచి బయటకు లోపలకు వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం సమాచారం మేరకు భారీస్థాయిలో పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన నిలిపివేయాలని హెచ్చరించారు. అయినప్పటికీ స్థానికులు ససేమిరా అనడంతో ఆందోళనను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు.. ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది.ఈ ఘటనలో బావాజీపేటకు చెందిన ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్టు సమాచారం.. శనివారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు ఆందోళనకారులను వాహనాలు ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. దీంతో ప్రస్తుతానికి వివాదం సమసింది. నాలుగు రోజులుగా జరుగుతున్న నిరవధిక దీక్షను భగ్నం చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు

కొవ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలో మెరకవీధి నుంచి బస్టాండ్ వరకు ఉన్న మెయిన్‌రోడ్‌లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో చేపట్టిన రహదారి మరమ్మతు పనులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు మున్సిపాల్టీ పరిధిలో వర్షాలకు రోడ్డు దెబ్బతిని గుంతలు పడి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సౌకర్యార్థం మరమ్మతు పనులను చేపట్టామన్నారు. పట్టణంలో గుత్తావారి చెరువు లేఅవుట్‌కు వెళ్లే రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. పట్టణంలో ఇందిరమ్మకాలనీ, అచ్చాయమ్మకాలనీలతోపాటు వివిధ ప్రాంతాలలో ఉన్న తాగునీటి సమస్యను కొంతవరకు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దుల సత్యనారాయణ, పెనుమాక జయరాజు, బహద్దూర్, డేగల రాము, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు జీవనోపాధి కల్పించాలి

మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్



మాట్లాడుతున్న తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన జీవనోపాధి ఏర్పాటు చేయాలని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శనివారం జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బందికి సమీక్ష సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు. మెప్మా పీడీ బి.ప్రియంవద, కమిషన్లు, మెప్మాసిబ్బంది, బీటీ ఈలు, సీఎంఎం, టీఎంసీ,సీవో, డీఈవోలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంటు కమిటీ సభ్యురాలు డా. జి.ఎస్.వి.ఎ.బి.ఎస్.మహాలక్ష్మి అన్నారు. శనివారం కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.సునీత అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. సొసైటీ సూత్రాలు మానవత్వం, నిష్పాక్షిత, తటస్థ, స్వతంత్రత, స్వచ్ఛంద సేవ, ఐక్యత, విశ్వసనీయతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. సమన్వయకర్త మదార్‌సాహెబ్, సూర్యనారాయణ, రాజేశ్వరరావు, అప్పల నరసింహం, పుష్పాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యురాలు మహాలక్ష్మి

గోష్పాదక్షేత్రంలో పారిశుధ్య పనులు



గోష్పాదక్షేత్రంలో పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం

కొవ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంను పురస్కరించుకుని కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల గోదావరి వరదల కారణంగా క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాల మెట్లపై భారీగా ఇసుక, ఒండ్రు మట్టి వచ్చి చేరింది. దీంతో పారిశుధ్యం అధ్వానంగా ఉందని భక్తుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పురస్కరించుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ల ఆదేశాలతో శనివారం క్షేత్రంలో పారిశుధ్య పనులు చేపట్టారు. స్నానఘట్టాలలో భక్తులు వదిలివేసిన వస్త్రాలు, వరదలకు కొట్టుకొచ్చిన ఒండ్రు మట్టి, ఇసుక, రహదారులకు ఇరువైపులా మొలిచిన పిచ్చిమొక్కలను తొలిగించారు. కార్తీకమాసం నెలరోజులు గోదావరి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా క్షేత్రంలో పారిశుధ్యం పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

నాచుపట్టి ప్రమాదకరంగా స్నానఘట్టాలు

గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు నాచుపట్టి భక్తులు జారి పడుతున్నారు. అఖండ గోదావరి తీరం గోష్పాదక్షేత్రం తెలియని వారుండరు. అంతటి ప్రాముఖ్యం కలిగిన క్షేత్రానికి నదీస్నానాలకు, అపరకర్మలు నిమిత్తం ప్రతిరోజు వందలాది మంది సుదూర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారు. నదీ స్నాన మాచరించడానికి దిగే భక్తులు స్నానఘట్టాల మెట్లు నాచుపట్టి ఉండడంతో జారి పడుతున్నారు. కార్తీకమాసంతోపాటు అయ్యప్ప భక్తులు అధికంగా గోష్పాదక్షేత్రానికి వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం స్నానఘట్టాల మెట్లుపై పట్టిన నాచుని పూర్తిగా తొలగించి ఇసుక వేయించాలని భక్తులు కోరుతున్నారు. అదేవిధంగా మహిళలకు బట్టలు మార్చుకోవడానికి క్షేత్రంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక షెడ్లు రేకులను ఇటీవల గోదావరి వరదల నేపథ్యంలో తొలగించారు. వరదలు తగ్గినా క్షేత్రంలో అయ్యప్ప ఆలయం ఎదురుగా ఏర్పాటుచేసిన షెడ్లకు రేకులు అమర్చకపోవడంతో నదీ స్నానాలు ఆచరించడానికి వచ్చిన మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని బట్టలు మార్చుకునే షెడ్లకు రేకులు పూర్తిస్థాయిలో అమర్చాలని కోరుతున్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

దేవర పల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి హేమస్మిత అన్నారు. కొత్తగూడెం గ్రామంలో పొగాకు బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలను ప్రభుత్వ పాఠశాల చెరువుగట్టు వద్ద విద్యార్థులు, రైతులు నాటారు. కార్యక్రమంలో రైతులు పరిమి శ్రీరామకృష్ణ, ముమ్మారెడ్డి సత్యనారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి పేర్కొన్నారు. శనివారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను న్యూట్రిషన్ పార్కు నిమిత్తం 10 సెంట్లు స్థలాన్ని కేటాయించాలని ఆమె చెప్పారు. ఎంపీడీవో వీఎస్ రామారావు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.అంజనేయశర్మ, అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

కొవ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేమని కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు అన్నారు. శనివారం కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జె.ధర్మరాజు, రైటర్ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీ ఆర్.భగవాన్ దాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

టీడీపీ కార్యకర్తలంతా సభ్యత్వ నమోదు చేసుకోవాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలంతా టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ కార్యాలయంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొవ్వూరు పట్టణం, మూడు మండలాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. అక్టోబరు 26 నుంచి డిసెంబరు నెలాఖరు వరకు సభ్యత్వ నమోదు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ, మండల అధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, క్లస్టర్ ఇన్‌చార్జిలు పెనుమాక జయరాజు, రాజాన శ్రీనివాస్, మద్దిపట్ల సురేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి గెల్లా సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగమహేశ్వరరావు

అందరికీ పని కల్పించేందుకు కృషి

గోపాలపురం, అక్టోబరు 26: ప్రతి ఒక్కరికి పని కల్పించటంతో పాటు గ్రామాభివృద్ధికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం దోహదం చేస్తుందని డీఆర్‌డీఏ పీడీ నాగమహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతం లో ఉపాధి లేక వలసలకు వెళ్ళేవారన్నారు. వలసలకు స్వస్తి చెప్పి స్వగ్రామంలో ఉపాధి కల్పించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిందన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ నాగ మహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 26కోట్లతో పల్లె పండుగలో భాగంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. అవకతవకలకు తావు లేకుండా చేపట్టిన ప్రతిపనిని పారదర్శ కంగా సామాజిక తనిఖీ బృందం పరిశీలించాయన్నారు. తనిఖీల్లో కోటి 28లక్షల 62వేల అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందాలు తేల్చాయన్నారు. సామాజిక తనిఖీల్లో భాగం గా రూ.2,56,603 రికవరీ చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. గంగోలులో పనులు చేయ కుండా జరిగినట్లు చూపించిన పనులకు సంబంధించి రూ. 58,21,000 విచారణకు ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, నందమూరి సత్య నారాయణ, రమేష్, జ్యేష్ఠ శ్రీధర్, మేని సుధాకర్, సర్పంచ్‌లు గంగారాణి, పైడి శిరీష, శేఖర్‌బాబు, ఏపీడీ రామ్‌ప్రసాద్, అంబుడ్స్ మ్యాన్ ప్రతినిధి బాషా, విజిలెన్స్ విభాగం ప్రతినిధి నరేష్, ఎస్ఆర్‌పీ తులసి నాయక్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 6తో ముగియనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లు నమోదు

గోపాలపురం, అక్టోబరు 26: వచ్చేనెల 6తో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు గడువు ముగుస్తుందని తహశీల్దార్ విద్యాపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఓటు నమోదుపై తహశీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలతో సమావేశం జరిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ నమోదు చేసిన దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను తహశీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో తమ దరఖాస్తు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో భూ సమస్యలు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శాంతిప్రియ

నల్లజర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కర వేదిక గ్రామసభలు అని తహశీల్దార్ శాంతిప్రియఅన్నారు. శుక్ర, శని వారాల్లో చీపురుగూడెం, అచ్చన్నపాలెం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. రెండు రోజుల గ్రామసభలో 70 మంది రైతులు తమ అర్జీలు అందించారు. కార్యక్రమంలో వీఆర్వో సునీత, సర్వే బృందం, కూసంపూడి వెంకటేశ్వరరావు, టీడీపీ అధ్యక్షులు చెల్లు పెద్దరామన్న, ఎం. సుబ్రహ్మణ్యం, వరుణ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పశుగణన ప్రారంభం

పెరవలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణన సందర్భంగా ఆయా గ్రామాల్లో పశుగణన ప్రారంభమైందని ఖండవల్లి పశువైద్యాధికారి డాక్టర్ సల్మా, పెరవలి పశువైద్యాధికారి చరణ్ పణీంద్ర, కానూరు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు పశుగణన ఉంటుందన్నారు. మండలంలో 12 మంది ఎన్యుమరేటర్స్ గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పొందుపరిచిన యాప్‌లో రైతులు ఇతర సంస్థల వివరాలు పొందుపరుస్తామన్నారు. ఖండవల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఉపసర్పంచ్ అతికాల వెంకట రామకృష్ణమ్మ, జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవి, రైతులు పాల్గొన్నారు.





వైద్యం కోసం ఎదురుచూస్తున్న హాస్టల్ విద్యార్థులు. పక్క చిత్రంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

ప్రైవేట్ హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

నల్లజర్ల, అక్టోబరు 26: నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీకాలనీకి చెందిన ఒక ప్రైవేటు హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురై నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరారు. శనివారం ఉదయం హాస్టల్ వార్డెన్ 15 మంది విద్యార్థులను నల్లజర్ల పీహెచ్‌సీకి తరలించారు. విద్యార్థులకు ఒళ్ళంతా ఎలర్జీలు, కంటి సమస్యల వంటి లక్షణాలతో ఆసుపత్రికి రావడంతో డాక్టర్ తెల్లం గంగాధర్ వారికి చికిత్స అందించారు. ఆదివారం చికెన్ తిన్నామని అప్పటి నుంచి తమకు ఈ పరిస్థితి వచ్చిందని విద్యార్థులు వాపోయారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శాంతిప్రియ హుటాహుటీన దూబచర్ల హాస్టల్‌ను పరిశీలించారు. వంటగది, బాత్‌రూమ్స్ వంటివి తనిఖీ చేశారు. దీనిపై కరస్పాండెంట్‌ను వివరణ కోరగా విద్యార్థులు దసరా సెలవులకు వెళ్లి వచ్చాక జనరల్ చెకప్‌లో భాగంలో ఆసుపత్రికి తీసుకుని వచ్చామన్నారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

నల్లజర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీ జడ్పీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు వేర్వేరుగా సమావేశాల్లో కోరారు. శనివారం నల్లజర్ల పార్టీ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ ఇంటి వద్ద నాయకులతో మాట్లాడారు. రాష్ట్రంలో గోపాలపురం నియోజకవర్గం సభ్యత్వంలో అగ్రస్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కూచిపూడి ఉదయ భాస్కరావు, లంకా సత్యనారాయణ, గుంటముక్కల వేణు, విడియాల శ్రీను, గుదే సుబ్బారావు, సవలం రామకృష్ణ పాల్గొన్నారు.

పెరవలి: కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు అతికాల వెంకట రామకృష్ణమ్మ(శ్రీను) పేర్కొన్నారు. టీడీపీ సభ్యత్వంలో భాగంగా ఆయన తీపర్రులో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలకు సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంటిపూడి సూర్యనారాయణ, ఉప్పలపాటి సత్తిపారాజు, నందమూరి నారాయణరావు, ర్యాలీ రామకృష్ణ, నల్లా సత్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర
నిడదవోలు	
వీ మ్యాక్స్	: దేవర
రాధాకృష్ణ	: వెనం
శ్రీగణపతి	: విశ్వం
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర